బుధవారం
7-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 225
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

సీయూఈటీ-యూజీ పరీక్షలు వాయిదా

న్యూఢిల్లీ: సీయూఈటీ- యూజీ పరీక్షలను వాయిదా వేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్టీఏ) భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు మంగళవారం ప్రకటించాయి. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు మే 8 నుండి జూన్ 1 వరకు భారత్ సహా వివిధ దేశాలలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సమన్వయ సమస్యల కారణంగా వాయిదా వేసినట్లు సమాచారం. అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి

- మిగతా 2 లో

నేడు ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్ష ఏపీ ఐసెట్ 2025 రెండు సెషన్లుగా నిర్వహిస్తు న్నట్లు ఏపీ ఐసెట్ చైర్మన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. మంగళవారం పాలక మండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనంజయరావు, సెట్ కన్వీనర్ ఆచార్య ఎం.శశితో కలిసి పరీక్ష వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షకు ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు హైదరాబాదులో 94 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షకు 37,572 మంది విద్యార్థులు

- మిగతా 2 లో

సంపన్నుడు జస్టిస్ కేవీ విశ్వనాథన్

న్యూఢిల్లీ: న్యాయవ్యవస్థలో పారదర్శకత పెంపొందించే చర్యల్లో భాగంగా జడ్జీల ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు వెల్లడించింది. న్యాయ మూర్తులు స్వయంగా అందజేసిన ఆస్తుల వివరాలను సర్వోన్నత న్యాయస్థానం తన వెబ్‌సైట్‌లో పెట్టింది. దీని ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రూ.55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్, రూ.14 వేల విలువైన షేర్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో రూ.1.06 కోట్లు, రూ.1.2 కోట్ల జనరల్ ప్రావిడెంట్ ఫండ్, రూ.29,625 ఎల్ఐసీ మనీ బ్యాక్ పాలసీ వార్షిక ప్రీమియం, దక్షిణ ఢిల్లీలో ఫ్లాట్, కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో 2,446 చదరపు అడుగుల

- మిగతా 2 లో

కమ్ముకొస్తున్న యుద్ధమేఘాలు

- అజిత్ దోవల్‌తో ప్రధాని కీలక భేటీ
- నేడు 244 జిల్లాల్లో మాక్ డ్రిల్... మూడు కేటగిరీలుగా విభజన
- రెండో కేటగిరీలో హైదరాబాద్, విశాఖ
- సన్నద్ధతపై హోంశాఖ సమీక్ష

న్యూఢిల్లీ: యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పాకిస్థాన్ పాలకులు కలవర పాటుకు గురవుతున్నారు. యుద్ధం వచ్చేసిందని, ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ గంటలు విఘడియలతో సహా యుద్ధం ఎప్పుడు మొదలవుతుందో కూడా చెప్పేస్తున్నారు. ముహూర్తాలు పెట్టేస్తున్నారు. అణు హెచ్చరికలు చేస్తున్నారు. అణ్వాయుధాలు తమ వద్ద మాత్రమే ఉన్నట్లు రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. నిజానికి, భారత్ వద్ద పాక్ కంటే శక్తివంతమైన యుధాలు ఉన్నాయి. ఒక్క అణ్వాయుధాలే కాదు, ఆయుధ సంపత్తితో సహా సైనిక సామర్థ్యం, సన్నద్ధత విషయంలో భారత దేశం పాక్ కు అందనంత ఎత్తులో ఉంది. కాగా...యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. అత్యవసర సమయాల్లో పౌరులు

- మిగతా 2 లో

నేడు కేంద్ర కేబినెట్ భేటీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య పరిస్థితులు మరంత వేడెక్కాయి. ప్రతిదాడి కోసం భారత్ పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఉగ్రవాదుల దాడి తర్వాత ఇప్పటికే అనేకసార్లు అత్యున్నతస్థాయి సమావేశాలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వం...బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం నిర్వహిస్తుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ సమావేశం 7వ తేదీన జరగనుంది. సరిహద్దుల్లో భద్రతా పరిస్థితులతో పాటు అనేక విషయాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పటికే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రధాని 48 గంటల్లోనే

- మిగతా 2 లో

మోదీకి ముందే తెలుసు

అందుకే మోదీ కశ్మీర్ పర్యటన రద్దు

మల్లికార్జున ఖడ్గే తీవ్ర ఆరోపణ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తీవ్ర ఆరోపణలు చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి గురించి మోదీకి మూడు రోజుల ముందే సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఈ మేరకు నిఘా వర్గాల నుంచి నివేదిక అందిన కారణంగానే ప్రధాని తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన 'సంవిధాన్ బచావో ర్యాలీ'లో ఖడ్గే ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. "నిఘా వైఫల్యం జరిగిందని ప్రభుత్వం

- మిగతా 2 లో

ఆర్టీసీ సమ్మె వాయిదా

ప్రభుత్వంతో చర్చలు ఫలప్రదం

- సమస్యల పరిష్కారానికి ఐఏఎస్‌లతో కమిటీ
- మా డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె తప్పదు: జేఏసీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఈ నెల 7వ తేదీ నుంచి ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ జేఏసీ నాయకులతో జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. జేఏసీ నేతలు లేవనెత్తిన డిమాండ్ల పరిష్కారానికి మంత్రి సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకున్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్ ఉన్నారు. కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి వారంలోగా పరిష్కారం చూపాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాగా ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె వాయిదా వేస్తున్నట్లు సచివాలయం మీడియా పాయింట్ వద్ద వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ సమ్మెను వాయిదా వేస్తున్నామని, సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామని, ప్రైవేటు విద్యుత్ బస్సుల గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ప్రభుత్వమే విద్యుత్ బస్సులు కొని ఆర్టీసీకి ఇచ్చేలా చర్యలు చేపడతామని

- మిగతా 2 లో

9న జర్నలిస్టులకు ఆర్థిక సహాయం

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



విశాలాంధ్ర-హైదరాబాద్: వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పని చేయలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. ఈ నెల 9న మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను అందజేస్తారని వివరించారు. ఇటీవల కాలంలో మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదు సంవత్సరాల వరకు ప్రతి కుటుంబానికి నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ (రూ.3000), ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ.2000 ట్యూషన్ ఫీజు, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మంజూరు చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ప్రాణాంతక వ్యాధులతో

- మిగతా 2 లో

పునరుత్పాదక ఇంధన రంగం బలోపేతం

- సహాయ, సహకారాలందించండి
- కేంద్రానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పునరుత్పాదక ఇంధన రంగం బలోపేతానికి రాష్ట్రానికి తగు రీతిలో సహాయ, సహకారాలు అందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రాన్ని కోరారు. ఈ విషయమై ఆయన మంగళవారం ఢిల్లీలో కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని కలిసి మూడు ముఖ్యమైన వినతిపత్రాలు అందజేశారు. పీఎం కుసుం కంపోనెంట్-ఎ కింద 500 కేడబ్ల్యూ నుండి 2 ఎండబ్ల్యూ సామర్థ్యం గల మొత్తం 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు, అలాగే ఒక లక్ష సౌర పంపు సెట్లు తెలంగాణకు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి సాగునీటి కల్పనకు శాశ్వత పరిష్కారంగా సౌర పంప్ సెట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రం భావిస్తోందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర వాటా నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. గిరిజనుల సాగు భూముల్లో విద్యుత్ లైన్ల స్థాపనకు అటవీ చట్టాలు ఆటంకంగా ఉన్నందున సహృదయంతో సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. వ్యవసాయరంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ వార్షిక పురోగతి రేటును సాధించడంతో పాటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైతు భరోసా వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తూ, వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నిబద్ధతతో పనిచేస్తున్న రాష్ట్రానికి కేంద్ర సహకారం తోడైతే మరిన్ని అద్భుతాలు చేసేందుకు వీలవుతుందని వివరించారు.

71 సంస్థలు... 1,050 ఎకరాలు

చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర రాజధాని అమరావతి కోర్ కేపిటల్ ఏరియాలో గజిటెడ్, నాన్ గజిటెడ్ ఉద్యోగుల నివాసాల కోసం నాలుగు ప్యాకేజీల్లో టవర్ల నిర్మాణానికి రూ.1,732.31 కోట్ల పనుల టెండర్లకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సీఆర్‌డీఏ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖమంత్రి పొంగూరు నారాయణ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అంతే గానీ, ప్రజలు ఓటేయకపోవడం వల్ల అని మాత్రం ఒప్పుకోరు!

గాలికి ఏడేళ్ల జైలు

- మరో నలుగురికి కూడా ఖరారు
- రాజగోపాల్‌కు మరో నాలుగేళ్లు అదనం
- సబిత, కృపానందకు ఉపశమనం
- ఓబులాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు సంచలన తీర్పు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఓబులాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు ఎట్టకేలకు తుది తీర్పు వెలువరించింది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులు గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. దోషులకు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబులాపురం మైనింగ్ కంపెనీకి రూ.2 లక్షల జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కేసు విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా, ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది.

రాజగోపాల్‌కు మరో నాలుగేళ్ల అదనపు శిక్ష

ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్ష ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది.

ఓఎంసీ కేసు విశేషాలు

2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి

- మిగతా 2 లో

ఉద్యోగులు మా సోదరులు, మిత్రులే

- అన్ని సమస్యలు పరిష్కరిస్తాం
- సీఎం వ్యాఖ్యల్ని వక్రీకరించొద్దు
- ప్రజా సంక్షేమం దృష్ట్యా అలా మాట్లాడారు
- మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉద్యోగ సంఘాల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ మాట్లాడిన అంశంపై విమర్శలు రావడంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. తమ ముఖ్యమంత్రి ముక్కుసూటిగా మాట్లాడారని, ఆయన మాటల్ని ఆవేదనగానే భావించాలని చెప్పారు. ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నామని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. "బీజేపీ నాయకులు పదవి దిగిపోవాలని అంటున్నారు. పహల్గాం ఘటనకు బాధ్యత

- మిగతా 2 లో

ఇది ఇస్లామిక్ వార్ కాదు

భారత్‌తో యుద్ధంపై పాక్ మతపెద్ద ఘాజీ

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ సొంత దేశంలోనే పాక్‌కు వ్యతిరేకత ఎదురవుతోంది. సొంత ప్రజానీకంపైనే పద్ధతి ప్రకారం పాక్ హింసకాండకు పాల్పడుతోందని, సొంత ప్రజలకే అన్యాయం చేస్తోందని ఇస్లామాబాద్ లాల్ మసీదు ఇమామ్ అబ్దుల్ అజీజ్ ఘాజీ విరుచుకుపడ్డారు. వివాదాస్పద మత బోధకుడిగా పేరున్న ఘాజీ... పాకిస్థాన్‌లోని అంతర్గత కల్లోలంపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాకిస్థాన్, భారత్ మధ్య యుద్ధం అంటూ జరిగితే ఎంతమంది ప్రజలు పాకిస్థాన్‌ను సమర్థిస్తారో చేతులెత్తండని మసీదుకు వచ్చిన వారిని ఆయన కోరారు. ప్రార్థనలకు హాజరైన వారిలో స్పందన కొరవడటం, ఎలాంటి బదులు రాకపోవడంతో ఆయన తిరిగి స్పందిస్తూ... ఏదో కొద్దిమంది చేతులెత్తడం కనిపిస్తోందని, ప్రజల్లో వివేకం మేల్కొందనడానికి ఇది నిదర్శనమని అన్నారు. పాకిస్థాన్, భారత్ మధ్య యుద్ధం ఎంతమాత్రం ఇస్లామిక్ వార్ కాదన్నారు. 'ఇవాళ పాకిస్థాన్‌లో ఉన్న వ్యవస్థ అపనమ్మకాల వ్యవస్థ. భారత్ కంటే దయనీయమైన నిరంకుశ వ్యవస్థ. పాకిస్థాన్‌లో ఉన్నంత అణచివేత భారత్‌లో లేదు. లాల్ మసీదు వంటి ఘోరమైన ఘటన భారత్‌లో జరిగిందా? వజిరిస్థాన్, ఖైబర్ ఫక్తుంఖ్వాలో జరుగుతున్నన్ని అకృత్యాలు భారత్‌లో చోటుచేసుకుంటున్నాయా? భారత్ యుద్ధ విమానాలు సొంత ప్రజలపైనే బాంబులు వేస్తున్నాయా? భారత్‌లో జాడతెలియకుండా పోయిన వారెంతమంది? ఇక్కడ జాడ తెలియకుండా పోయిన తమ కుటుంబ సభ్యుల కోసం నిరసనలు చేసి చేసి ప్రజలు విసిగి వేశారి పోతున్నారు. మత బోధకులు, పాత్రికేయులు మాయమవుతున్నారు. తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ సభ్యుల జాడ తెలియడం లేదు' అని పాక్‌పై ఘాజీ విరుచుకుపడ్డారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని ఘాజీ బహిరంగంగానే విమర్శించడం సోషల్ మీడియాలోచర్చనీయాంశమైంది.

యుద్ధం కాదు...చర్చలతోనే శాంతి

- కవ్వింపులు-సైనిక చర్యలు వద్దు
- సంయమనం పాటించాలి
- భారత్-పాక్‌కు ఐరాస హితవు

న్యూయార్క్: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మునుపెన్నడూ లేని స్థాయికి చేరుకోవడంపై ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితుల తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించింది. పాకిస్థాన్ తీరును ఆక్షేపించింది. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ క్షిపణి పరీక్షలు నిర్వహించిన పాకిస్థాన్‌కు మొట్టికాయలు వేసింది. సైనిక చర్యల ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని హితవు పలికింది. సాధ్యమైనంత మేరకు సంయమనం పాటించాలని, శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఉద్బోధించింది. అవసరమైతే మధ్యవర్తిత్వానికి లేదా లేదా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమని రెండు దేశాలకు ఐరాస తెలిపింది. పాకిస్థాన్ కథనాన్ని ఐరాస సభ్యదేశాలు తోసిపుచ్చాయి. ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా హస్తముందా అని ప్రశ్నించాయి.

భారత్-పాక్ వివాదం నేపథ్యంలో జనాంతిక సమావేశంలో ఐరాస సభ్యదేశాలన్నీ పాకిస్థాన్‌ను ఆక్షేపించాయి. కవ్వింపు చర్యలు మానుకోవాలని హితవు పలికాయి. కయ్యానికి కాలు దువ్వకుండా వెనక్కు తగ్గాలని సూచించాయి.

ఎన్నడూ లేని స్థాయి తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు భారత్-పాక్ మధ్య నెలకొనడంపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితి తనను బాధిస్తోందని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. పౌరులను లక్ష్యంగా దాడులు చేసుకోవడం ఆక్షేపణీయమన్నారు. బాధ్యులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. సైనిక చర్యలు తీవ్రరూపం దాల్చకుండా నివారించడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమని, ఇందుకోసం రెండు దేశాలు సాధ్యమైనంత మేరకు సంయమనం పాటించాలని సూచించారు. తప్పు చేయొద్దని భారత్, పాకిస్థాన్‌కు హితవు పలికారు. సైన్యాన్ని రంగంలోకి దిగంచడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, అలాంటి తప్పు చేయొద్దని, వెనకడుగు వేయడం శ్రేయస్కరమని రెండు దేశాలకు సందేశమిచ్చారు. శాంతి స్థాపన దృష్ట్యా దౌత్య మార్గంలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఐక్యరాజ్య సమితి సిద్ధమని గుటెర్రస్ అన్నారు.

పొరుగు దేశంతో యుద్ధం జరిగే పరిస్థితులు నెలకొన్న వేళ క్షిపణి పరీక్షలతో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారా అంటూ పాకిస్థాన్ తీరును ఐరాస సభ్యదేశాలు మందలించాయి. దీంతో తాజా పరిస్థితులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి భారత్‌ను దోషిగా నిలబెట్టేందుకు పాకిస్థాన్ మరో ప్రయత్నం విఫలమైంది. ఐరాస భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను గ్రీస్ నిర్వహిస్తోంది. కాగా, పాకిస్థాన్ ఐరాస బద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా ఉంది. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్మేయడంతో ఈ సమావేశాన్ని నిర్వహించి... శాంతియుత పరిష్కారం శ్రేయస్కరమని రెండు దేశాలకు ఐరాస హితవు పలికింది. సమావేశం అనంతరం మిడిల్‌ఈస్ట్, ఏషియా & పసిఫిక్ డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ పొలిటికల్, పీస్ బిల్డింగ్ అఫైర్స్ & పీస్ ఆపరేషన్స్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఖాలిద్ మహమ్మద్ ఖియారీ విలేకరులతో మాట్లాడారు. రెండు దేశాల మధ్య అస్థిర పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ సమావేశం ఫలప్రదంగా జరిగిందని ఐరాస భద్రతా మండలి అధ్యక్షుడు, గ్రీస్ రాయబారి ఎవాంగెలోస్ సెకెరీస్ అన్నారు. రష్యా దౌత్యాధికారి స్పందిస్తూ త్వరలోనే పరిస్థితులు సర్దుమణుగుతాయని ఆశిస్తున్నామన్నారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు గంటన్నర పాటు ఐరాస సమావేశం జరిగింది. అంతర్జాతీయ వేదికపై భారత్‌ను దోషిగా నిలబెట్టేందుకు ఐరాసకు పాక్ శాశ్వత ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖార్ యత్నించారు. కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. అయితే పాకిస్థాన్ కథనాన్ని ఐరాస సభ్యదేశాలు తోసిపుచ్చాయి. దాడి వెనుక లష్కరే తోయిబా హస్తం ఉందా అని ప్రశ్నించాయి. రెండు దేశాలు సంయమనం పాటించాలని... సైనిక చర్చలు వద్దని, చర్చలు జరపాలని సూచించాయి. దీనిపై ఇఫ్తిఖాన్ స్పందిస్తూ ఐరాస సూచలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. తమ దేశం ఘర్షణను కోరుకోవడంలేదన్నారు. తమ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకోవడం కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 1960 నాటి సింధూ జల సంధి రద్దు అంశాన్ని పాకిస్థాన్ లేవనెత్తింది. 'నీరు... జీవనాధారం, అస్త్రం కాదు. ఈ నదులపై ఆధారపడి 240 మిలియన్ల మంది పాకిస్థానీయుల జీవిస్తున్నారు' అని అన్నారు.

భారత్ సహా పొరుగు దేశాలతో శాంతి, సమన్వయానికి పాకిస్థాన్ కట్టుబడి ఉన్నట్లు నొక్కిచెప్పారు. పరస్పరం గౌరవించుకుంటూ చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ సిద్ధమన్నారు. అంతకుముందు ఐరాసకు భారత్ పూర్వ శాశ్వత రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికగా భారత్‌ను దోషిని నిలబెట్టేందుకు పాక్ మరోసారి విఫలప్రయత్నం చేసిందన్నారు. ఐరాస భద్రతా మండలి స్పందన అర్థవంతంగా లేదని, పాకిస్థాన్ ఆరోపణలను భారత్ మళ్లీ తిప్పికొట్టిందని అన్నారు.

కమ్ముకొస్తున్న యుద్ధ మేఘాలు

(మొదటిపేజీ తరువాయి)

ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించి, వారిని సమాయత్తపరిచేందుకు దేశవ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రేపు ఈ కసరత్తు జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మాక్ డ్రిల్ సన్నద్ధతపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మంగళవారం కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సివిల్ డిఫెన్స్, ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్స్ (డీజీలు), జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డీఎంఏ) అధికారులు హాజరయ్యారు. అనంతరం గోవింద్ మోహన్ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రేపు జరగబోయే మాక్ డ్రిల్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై వారికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 244 జిల్లాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ముఖ్యంగా డిఫెన్స్, అణు విద్యుత్ కేంద్రాలు ఉన్న ప్రాంతాలను ప్రాతిపదికగా చేసుకుని ఈ జిల్లాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. అణు విద్యుత్ కేంద్రాలున్న ఢిల్లీ, ముంబై, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్ భటా, చెన్నై, కల్పక్కం, నరోరా వంటి ప్రాంతాలు కేటగిరీ-1 కిందకు వస్తాయి. ఇక కేటగిరీ-2 జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో కేటగిరీలో 45 జిల్లాలున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లోని విమానాశ్రయాలు, ఇతర జనసమర్థ ప్రాంతాల్లో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు.

ఈ కసరత్తులో భాగంగా ప్రజలకు శిక్షణ, అవగాహన కల్పించడంపై హోంశాఖ సమీక్షలో ప్రధానంగా చర్చించారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు (బ్లాక్ అవుట్) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం ఇళ్లలో ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువులు, మందుల గురించి ప్రజలకు వివరించాలని సమావేశంలో సూచించారు.

కాగా, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్‌తో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రస్తుత భద్రతా పరిస్థితులు, పాకిస్థాన్ వైఖరి, తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. కేవలం 48 గంటల వ్యవధిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి. ఈ చర్చలు దేశ భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. సోమవారం రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రధానమంత్రిని కలిశారు. అంతకుముందు, వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కూడా మోదీతో సమావేశం నిర్వహించారు.

నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిలతో విడివిడిగా సమావేశాలు జరిగాయి. కాగా ఎల్‌ఓసీ వద్ద పాక్‌సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. వరుసగా 12వ రోజు సోమవారం రాత్రి పాక్ రేంజర్లు సరిహద్దుల్లోని వివిధ చెక్ పోస్టుల వద్ద తేలికపాటి ఆయుధాలతో కాల్పులు జరిపారు. కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెంధర్, నౌషెరా, సుందర్బని, అక్నూర్ సెక్టార్లలో కాల్పులు జరపగా... భారత సైన్యం పాక్ రేంజర్లకు దీటుగా సమాధానం ఇస్తోంది.

నేడు కేంద్ర కేబినేట్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

రెండుసార్లు భేటీ అయ్యారు. ఉగ్రదాడి జరిగిన సమయం నుంచి దేశంలో పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. పాక్ విషయంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ప్రపంచదేశాలన్నీ ఆసక్తిగా గమనిస్తున్నాయి. దేశ భద్రతపై మోదీ కొన్ని రోజులుగా వరుస భేటీలు నిర్వహిస్తుండటంతో పాక్‌లో అలజడి రేగుతుంది.

ఇలాంటి సమయంలో మరోసారి కేబినేట్ సమావేశం జరగనుంది. భారత్‌పై పాక్ వైమానిక దాడులకు దిగితే ఎలా వ్యవహరించాలి? ప్రజలు ఆందోళనకు గురికాకుండా ఎలాంటి సూచనలు చేయాలి? దేశంలో అత్యవసరమైన కీలక కర్మాగారాలు ఎక్కడ ఉన్నాయి? ఏదైనా ప్రమాదం జరిగితే హుటాహుటిన ప్రజల్ని తరలించే మార్గాలు ఏంటి? వంటి అంశాలను కేబినెట్‌లో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగులు మా సోదరులు, మిత్రులే

(మొదటిపేజీ తరువాయి)

వహించి బీజేపీ నేతలే పదవి నుంచి తప్పుకోవాలి. ఉద్యోగుల డిమాండ్లు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం. హామీలు ఇచ్చేప్పుడే అన్ని అంచనాలు వేసుకొని ఇచ్చాం. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ విషయంలో కక్ష సాధింపు లేదు. అధికారులు కొన్ని నియమ నిబంధనలు అనుసరించాల్సిందే. అందాల పోటీలకు, ఉద్యోగ సమస్యలకు లింక్ పెట్టొద్దు. రాష్ట్ర ప్రతిష్ఠతను ప్రపంచస్థాయిలో పెంచేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నాం" అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదనతో మాట్లాడటానికి గల కారణాలు వివరించారు. "ప్రజా సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడారు సీఎం. గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసం చూసి ఆవేదనతో మాట్లాడారు. నేను ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు చేయాలి కానీ డబ్బులు లేవు అనే ఆవేదన సీఎం లో ఉంది. బీఆర్ఎస్ వాళ్లకు జీతాలే సరిగా వేయలేదు. వాళ్లకు ప్రేమ ఉన్నట్టా? మేం రాగానే డీఏ ఇచ్చాం. వాళ్లలాగా మేము వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పులు కూడా ప్రభుత్వమే కడుతుంది. కేటీఆర్ కేవలం ప్రభుత్వం చేసిన అప్పుల గురించే మాట్లాడుతున్నారు" అని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని దివాళా తీయించింది కేసీఆర్ అని... దాని నుంచి బయట పడేసే పని మేము చేస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు. ఉద్యోగస్తులు మా సోదరులు.. మా మిత్రులేనన్నారు. ఆలస్యం అయినా. అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు. తెలంగాణ లోనే కాదు..దేశ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఏదిఏమైనా వనరులు పెంచి... నిధులు తెచ్చే పనిలో ఉన్నామని తెలిపారు. రిటైర్మెంట్ ఉద్యోగుల బెనిఫిట్ ఇవ్వలేక నాడు కేసీఆర్ ఉద్యోగుల పదవీ కాలాన్ని పెంచారని... కానీ తాము యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆలోచనతో ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై స్పందిస్తూ... మావోయిస్టుల తో మా కుటుంబానికి అన్యాయం జరిగింది. కానీ ఇంకో కుటుంబానికి అన్యాయం జరగొద్దు అనేది మా ఆలోచన. శాంతి చర్చలు కోరడం తప్పు కాదు. మా ప్రభుత్వమే గతంలో మావోయిస్టుల తో చర్చ చేసిందని గుర్తు చేశారు.

'గాలి'కి ఏడేళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009 డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఐపీసీ 120బి రెడ్ విత్ 420, 409, 468, 471తో పాటు కొంతమందిపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13 (2) రెడ్‌విత్ 13 (1)(డి)కింద సీబీఐ అధికారులు అభియోగాలు నమోదు చేశారు. ఆ తర్వాత దీనిపై తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం... ఇలా వివిధ రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఈ కేసు దర్యాప్తుకే దాదాపు ఐదేళ్ల సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లు దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్ తొలిసారి వేయగా... 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ కేసులో మొత్తం 219 మంది సాక్షులను విచారించింది. అనంతపురం జిల్లా పరిధిలోని ఓబులాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్నాటక సరిహద్దుల్లో పెద్దఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. దీనిద్వారా రూ.844 కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైందని ఛార్జిషీట్‌లో పొందుపరిచారు. ఈ కేసు విచారణలో మొత్తం 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్దఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది.

ఆర్టీసీ సమ్మె వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

తెలిపిందన్నారు. అలాగే కారుణ్య నియామకాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని చెప్పామని, విశ్రాంత ఉద్యోగుల బకాయిలపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. వేతన సవరణ గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై సుదీర్ఘంగా చర్చించామని వెల్లడించారు.తమ డిమాండ్లను తీర్చకపోతే ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం భారీ కవాతు సైతం నిర్వహించారు. ఆర్టీసీ కార్మిక సమస్యల పరిష్కారం కోసం మే 7న తెల్లవారుజాము నుంచి సమ్మెకు పిలుపునిచ్చినట్లు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ వెల్లడించారు. దీంతో వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు బహిరంగ లేఖ రాసింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటున్న ఆర్టీసీని సమ్మె ద్వారా దెబ్బతీయవద్దని కోరింది. అలా కాకుండా మొండిగా సమ్మెకు దిగితే మాత్రం కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు చేయడం నిషేధమని పేర్కొంది. తాజా చర్చల్లో ఆర్టీసీ జేఏసీ-ప్రభుత్వం మధ్య అంగీకారం కుదరడంతో సమ్మె వాయిదాపడింది.

71 సంస్థలు... 1,050 ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

మీడియాకు వివరించారు. రాజధాని అమరావతి కోర్ కేపిటల్ ఏరియాలో ఇప్పటి వరకూ మొత్తం 71 సంస్థలకు 1,050 ఎకరాలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 2014-19 మధ్య కాలంలో చేపట్టిన గజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.514.41 కోట్ల విలువైన టెండర్లకు, బాహ్య మౌలిక సదుపాయాల కల్పనకు రూ.194.73 కోట్ల విలువైన టెండర్లకు సీఆర్డీఏ సమావేశం ఆమోదం తెలపగా... నాన్ గజిటెడ్ ఉద్యోగుల నివాసానికి తొమ్మిది టవర్ల నిర్మాణం కోసం రూ.506.67 కోట్ల విలువైన టెండర్లకు, మరో 12 టవర్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు రూ.517.10 కోట్ల విలువైన టెండర్లకు తాజాగా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. 190 ఎంఎల్‌డీ సామర్థ్యంగల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి, ఐదేళ్ల పాటు ఆపరేషన్ నిర్వహణకు రూ.560.57 కోట్ల విలువైన టెండర్లకు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.494.86 కోట్ల విలువైన టెండర్లకు ఆమోదం లభించింది. జాతీయ రహదారికి అనుసంధాన మయ్యే ఇ-3, ఇ-13, ఇ-15 రోడ్ల నిర్మాణానికి, ఇ-3 సీడ్ యాక్సిస్ రోడ్డులో 1.5 కి.మీ మేర ఎలివేటెడ్ రోడ్ల నిర్మాణానికి, 4.10 కి.మీ ఇ-13 రోడ్డును రూ.384.78 కోట్లతో పొడిగించేందుకు, 3.98 కి.మీ. ఇ-15 రోడ్డును రూ.70 కోట్లతో పొడిగించేందుకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. న్యాయ విశ్వవిద్యాలయాలనికి 55 ఎకరాలు, క్వాంటమ్ వేలీకి 50 ఎకరాలు, ఆదాయ పన్ను శాఖకు 0.78 ఎకరాలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి 0.78 ఎకరాలు, కోస్టల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి 0.40 ఎకరాలు, ఐఆర్సీటీసీ హోటళ్లకు ఎకరం కేటాయించగా... బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు గతంలో కేటాయించిన 15 ఎకరాలకు తోడు వైద్య కళాశాల నిర్మాణానికి మరో 6 ఎకరాలు కేటాయించినట్లు మంత్రి వివరించారు.

మోదీకి ముందే తెలుసు

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించింది. దాన్ని పరిష్కరిస్తామని కూడా చెప్పింది. ఒకవేళ వారికి ముందే ఈ విషయం తెలిస్తే, ఎందుకు తగిన చర్యలు తీసుకోలేదు? పహల్గాం దాడికి మూడు రోజుల ముందే ప్రధాని మోదీకి ఇంటెలిజెన్స్ నివేదిక అందిందని నాకు తెలిసింది. అందుకే ఆయన తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇదే విషయాన్ని నేను వార్తాపత్రికల్లో చదివాను. మీరు అక్కడికి వెళ్లడం మంచిది కాదని ఇంటెలిజెన్స్ ముందే హెచ్చరిస్తే అక్కడ ఉన్న పర్యటకులు, పౌరులు జాగ్రత్తల కోసం ఎందుకు సరైన చర్యలు తీసుకోలేదు. ఒకవేళ మీకు ముందు సమాచారం ఉంటే అదనపు బలగాను అక్కడికి ఎందుకు పంపించలేదు" అని ఖర్గే ప్రశ్నించారు. అయితే పార్టీల కన్నా దేశమే ముఖ్యమని ఖర్గే అన్నారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని చెప్పారు. ఇందిరా గాంధీ, మహాత్మా గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని, సోనియా గాంధీ దేశం కోసం ఎంతో చేశారని గుర్తు చేశారు. సోనియా గాంధీ రెండు సార్లు ప్రధానమంత్రి పదవిని వదులుకున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడమే మోదీ ప్రభుత్వ విధానమని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాల నుంచి ఉద్యోగాలను లాగేసుకుంటుందని విమర్శించారు. రిజర్వేషన్లపై ఉన్న 50శాతం కోటాను తొలగించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన నాయకులను బెదిరించే చర్యలను మోదీ విడనాడాలని హితవు పలికారు. తాము పేద ప్రజలు, గిరిజనుల అభివృద్ధి కోసం పోరాడుతున్నామ న్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో కోటా అమలు చేయాలి

ఎస్సీలు, ఎస్టీలు,ఓబీసీల రిజర్వేషన్లపై ఏకపక్షంగా విధించిన 50% పరిమితిని రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను అనుమతించే ఆర్టికల్ 15(5)ని పూర్తిగా అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి రాసిన లేఖలో కోరారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాబోయే కుల గణన కోసం తెలంగాణ నమూనాను అధ్యయనం చేయాలని, సమగ్ర కుల గణనను అమలు చేయాలని, సంబంధిత విధాన సంస్కరణలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అలాగే దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులానికి సంబంధించి సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలన్నారు. ఉన్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై మార్చి 25, 2025న సమర్పించిన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆర్టికల్ 15(5)ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని ఖర్గే పేర్కొన్నారు.

సామాజిక న్యాయం అనే అంశాన్ని లేవనెత్తినందుకు ప్రధాని మోదీ ఆయన సహచరులు కాంగ్రెస్‌పై దాడి చేశారని... అయినప్పటికీ మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రతిజ్ఞ చేసినట్లుగా ఆర్థిక న్యాయం, హోదా, అవకాశాల సమానత్వాన్ని నిర్ధారించడానికి కులగణన ఖచ్చితంగా అవసరం అని ఖర్గే స్పష్టం చేశారు. నొక్కి చెప్పారు. సమాజంలో వెనుకబడిన అణగారిన వర్గాల హక్కులను అందించే కులగణన వంటి ప్రక్రియను నిర్వహించడం ఏవిధంగానూ విభజనగా పరిగణించకూడదని ఖర్గే హితవు పలికారు.

సంపన్నుడు జస్టిస్ కేవీ విశ్వనాథన్

(మొదటిపేజీ తరువాయి)

విస్తీర్ణంలో ఓ అపార్ట్‌మెంట్, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసీలో ఇల్లు ఉన్నాయి. చరాస్తుల్లో 250 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి, మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి. తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్‌కి బ్యాంకులో రూ.19.63 లక్షల నగదు, రూ.5.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మహారాష్ట్రలోని అమరావతిలో తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబైలోని బాంద్రా, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీల్లో అపార్ట్‌మెంట్‌లు, వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆయన సతీమణి వద్ద రూ.29.70 లక్షల విలువైన ఆభరణాలు, రూ.61,320 నగదు డిపాజిట్ ఉన్నాయి. ఈ ఏడాది నవంబర్ 24న భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగ్రామ్‌లో ఇంటిస్థలం, రూ.4.11 కోట్ల విలువైన స్థిర డిపాజిట్లు, 100 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, మూడు విలువైన గడియారాలు ఉన్నాయి. జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు రూ.120 కోట్లకు పైగా పెట్టుబడులు, ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ డెవలప్ మెంట్ ఏరియా, గుల్‌మోహర్ పార్క్‌లో ఆస్తులు, తమిళనాడులోని కోయంబత్తూరులో అపార్ట్ మెంట్ ఉన్నాయి. 2010-11 నుంచి 2024-25 వరకు ఉన్న రూ.91.47 కోట్లకు పైగా ఆదాయపు పన్ను వివరాలు ప్రకటించారు. వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనే కాకుండా హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల ఎంపిక ప్రక్రియ, హైకోర్టు కొలీజియానికి అప్పగించిన బాధ్యతల వివరాలు సహా ఇతర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవల భారీ మొత్తంలో నగదు లభ్యమైందన్న ఆరోపణలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై అనుమానాలు రేపిన నేపథ్యంలో న్యాయమూర్తులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

9న జర్నలిస్టులకు ఆర్థిక సహాయం

(మొదటిపేజీ తరువాయి)

బాధపడుతున్న, ప్రమాదానికి గురై భృతిని కోల్పోయిన జర్నలిస్టులు, ఇతర వ్యాధులకు గురైన వారికి లక్ష రూపాయల చొప్పున మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా, మీడియా. అకాడమీ వెబ్‌సైట్ https://mediaacademy.telangana.gov.in ను, జర్నలిస్టుల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ ప్రచురించిన వివిధ అంశాలతో కూడిన చిరు పుస్తకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరిస్తారు.

సీయూఈటీ-యూజీ పరీక్షలు వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఉందని అధికార వర్గాలు తెలిపాయి. యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. నీట్ తర్వాత దేశంలోనే ఇది రెండవ అతిపెద్ద ప్రవేశపరీక్ష. భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర, డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీల్లో ప్రవేశం కోసం ప్రతి ఏడాది సుమారు 13 లక్షలకు పైగా విద్యార్థులు సీయూఈటీ పరీక్షల కోసం నమోదు చేసుకుంటారు.

నేడు ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్నారని, బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు రెండవ సెషన్ జరుగుతుందన్నారు. ఉదయం సెషన్‌లో పరీక్ష రాసేవారిని ఉదయం 7:30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతిస్తారని తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలు రాసేవారికి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతిస్తారన్నారు. కంప్యూటర్ ఆధారితంగా జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు తమ హాల్ టికెట్, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి.

పరీక్ష కేంద్రంలో బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను ఉపయోగించవచ్చు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు. హాల్ టికెట్లు cets.apsche.ap.gov.in వెబ్ సైట్‌లో పొందుపరిచామని విద్యార్థులు డౌన్ లోడ్ చేసుకుని నేరుగా పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. పరీక్షకు ఎటువంటి నెగిటివ్ మార్కింగ్ లేదని, అభ్యర్థులు కాలాన్ని సక్రమంగా, సమర్థవంతంగా వినియోగించుకొని పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని కన్వీనర్ ఆచార్య ఎం.శశి సూచించారు. ముందుగా ప్రాథమిక కీని విడుదల చేసి, అనంతరం ఈనెల 21న ఫలితాలు విడుదల చేస్తామని ఆమె తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఎండల తీవ్రత, ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సెట్ కన్వీనర్ సూచించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా : అనుమానుల

విశాలాంధ్ర- తొర్రూరు: బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమానుల తిరుపతిరెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డిల ఆదేశాల మేరకు మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పైండ్ల సోమయ్య, పైండ్ల మహేందర్‌ల పైండ్ల కేశమల్లు అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం బాధిత కుటుంబాన్ని సందర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరెడ్డిల సహకారంతో బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు బాధిత కుటుంబాలకు సకాలంలో అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రమర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, చెవిటి సధాకర్, కొమురయ్య, బిజ్జాల వరప్రసాద్, నాగిరెడ్డి, రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మహబూబ్ రెడ్డి, వెంకన్న యాదవ్,వాసు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి,దర్గయ్య,యాకన్న, చిట్టి మల్ల మహేష్, బుచ్చిరెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: క్రీడలు శారీరక దృఢత్వాన్ని తో పాటు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ జిల్లాలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సమ్మర్ క్యాప్స్‌కు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. అందులో భాగంగానే మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అట్టి స్పోర్ట్స్ మెటీరియల్‌ను ఇనుగుర్తి క్యాంపుకు వాలీబాల్, గార్ల క్యాంపుకు బాస్కెట్ బాల్ స్పోర్ట్స్ మెటీరియల్ క్యాంప్ ఇంచార్జ్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడాదికారి జ్యోతి, క్యాంప్ ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలి :కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: వరంగల్ మంచిర్యాల జాతీయ రహదారి సిఎన్‌జి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలం ని వేంపాడు గ్రామంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులు, పుట్టపాక గ్రామం, మంథని వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఏక్లాస్ పూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, మంథని పట్టణం పాత పాల కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన నాణ్యమైన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి శ్రీ మాల,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,మంథని తహసిల్దార్ కుమారస్వామి,రామగిరి తహసిల్దార్ సుమన్, ఏడిఎం అంజని,ప్యాక్స్ సీఈఓ అశోక్,ఏపిఎం పద్మ,ఏఈ మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పాయం జన్మదినోత్సవం

విశాలాంధ్ర - పినపాక : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు పినపాక నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా మంగళ వారం ఆయన మణుగూరు హనుమాన్ దేవాలయంలో వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు బంతిపూల గజమాలలతో ఘనంగా సత్కరించి, ఎమ్మెల్యే పాయంతో భారీ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన నాయకులకు, అభిమానులకు ఎమ్మెల్యే జ్యూస్, పండ్లు అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. అన్నదాన కార్యక్రమం, నిత్యవసర సరుకులతోపాటు రోగులకు పండ్లు పంపిణీ చేసిన అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పినపాక మండల తహసీల్దార్ అద్దంకి నరేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనులు శాలువాకప్పి, పుష్పగుచ్చం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కష్టపడుతున్న ఎమ్మెల్యే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల అధ్యక్షుడు పిరినకి నవీన్, పినపాక మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం, కొర్స ఆనంద్, ఆరే నవీన్ కుమార్, గంగిరెడ్డి వెంకట్ రెడ్డి, తరుణ్ రెడ్డి, వర్మ, సైదులు, సౌజన్య, అన్ని మండలాల నాయకులు, యువజన నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

మజ్జిగ, పులిహోర ప్యాకెట్ల పంపిణీ

విశాలాంధ్ర -నేరేడుచర్ల : వాసవి క్లబ్ వనితా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నేరేడుచర్ల చలివేంద్రం దగ్గర వాటర్, మజ్జిగ, పులిహోర పోలిశెట్టి వినయ్ ధర్మపత్ని ధనలక్ష్మి కుమారుడు మనీష్ జన్మదిన సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త లక్ష్మణ్,డిస్టిక్ పారాయణం చైర్మన్ కందిబండ వాసంతి పండుగలు సాంప్రదాయాల చైర్మన్ వీరవెల్లి శ్రీలత జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీనరసింహారావు, వాసవి క్లబ్ పిఎస్టి చెరుకు రాము, గర్నె వాసు వనిత క్లబ్ అధ్యక్షురాలు గర్నె జ్యోతి, రేపాల ఊర్మిళ, కట్టమూరి మధు, రాచకొండ అంజయ్య మాశెట్టి సైదయ్య తడక మల్ల స్వామి కందిబండ నాగేశ్వరరావు చందా కిషన్ పైడిమర్రి వాసు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు తీవ్ర అంతరాయం

విశాలాంధ్ర -ఖమ్మం: ఖమ్మం నగరంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది బలమైన ఈదురు గాలులతో వర్షం రావడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగి ఖమ్మం నగరం అర్ధరాత్రి వరకు అంధకారంలో ఉండిపోయింది. ఇటీవల కాలంలో ఇంత పెద్ద వర్షం కురవడం ఇదే తొలిసారి అని పలు రా అంటున్నారు. ఖమ్మం పాత బస్టాండ్ ప్రాంతం వర్షపు నీటితో చిన్నపాటి చెరువును తలపించేలా తయారైంది. ఖమ్మం తోపాటు వైరా మండలంలోని చిన్న మునగాల కాసారం తాటిపూడి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అయ్యా ప్రాంతాల్లో రైతులు అకాల వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే కళ్ళల్లోని ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోగా మంగళవారం సాయంత్రం వీచిన బలమైన గాలులకు మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రబీ ధాన్యం కొనుగోలు లో భాగంగా ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, నిజామాబాద్ తర్వాత అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన జిల్లాలలో నల్గొండ రెండవదని తెలిపారు. వర్షం వచ్చినప్పటికి రైతులు ఎలాంటి ఇబ్బంది పడాల్సినావసరం లేదని, వారం రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలును పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలం కొప్పోలు, గుర్రంపోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ లారీల సమస్య ఉత్పన్నమైందని తెలుసుకొని తక్షణమే ఈ రెండు కేంద్రాలకు వెళ్లి సమస్యపై అక్కడి రైతులు, స్థానికులతో మాట్లాడారు. లారీల సమస్య లేకుండా లారీలను ఎప్పటికప్పుడు పంపించే ఏర్పాటు చేస్తామన్నారు. ఒకే మిల్లుకు నాలుగైదు లారీలు పంపించకుండా ఆ పరిధిలో ఉన్న అన్ని మిల్లులకు ఒక్కో లారీ పంపించాలని, అప్పుడే ధాన్యాన్ని వెంట వెంటనే దించుకోవడం కొనుగోలు కేంద్రాలనుండి పంపించడం సులభం అవుతుందని, లేదంటే ఒకే మిల్లుకు పంపించినట్లయితే దిగుమతి చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఒకవేళ కేటాయించిన లారీలు సరిపోకపోతే అదనంగా స్థానికంగా లారీలను ఏర్పాటు చేయా లని తహసీల్దార్ శ్రీనివాసులు ఆమె ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుకూలంగా ఉంటే వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని చెప్పారు. ఎవరైనా మిల్లర్లు కావాలని ఇబ్బందులు పెట్టినట్లయితే వారిపై చర్య తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరిస్తున్నామని, తనతోపాటు, పౌర సరఫరాల అధికారులు, ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ ప్రతిరోజు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, రెవెన్యూ అదనపు ఇన్చార్జి కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, గుర్రంపొడ్ తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కొప్పోలు, గుర్రంపోడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా నిర్వహిస్తుం డగా, ఈ రెండు కేంద్రాలలో రికార్డుల నిర్వహణ ,తేమ అన్ని సక్రమంగా ఉండడం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

మైనారిటీ విద్యార్థులకు గురుకుల కళాశాలలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మైనారిటీ విద్యార్థుల కోసం గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా ఒక ప్రకటనలో కోరారు. మైనార్టీ విద్యార్థిని విద్యార్థుల కోసం గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ఇంటర్ వరకు గురుకులాలను ఏర్పాటు చేసి విద్యా అవకాశాలు కల్పించిందన్నారు. ఈ గురుకులాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న పేద విద్యార్థులకు డిగ్రీ గురుకుల కళాశాలలు లేక చాలామంది డ్రాప్స్ గా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 10,000 మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బయటికి వెళ్తున్నారన్నారు. మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులకు స్వస్తి పలుకుతున్నారని యాకూబ్ పాషా వివరించారు. యస్సీ, యస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 79 గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని తెలిపారు. మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేక పోవడం బాధాకరమన్నారు. దీని కారణంగా గురుకులాలో ఇంటర్ వరకు చదివిన విద్యార్థులు ఉన్నత విధ్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిణామాలు గమనించి కాంగ్రెస్ ప్రభుత్వం బాల, బాలికల కోసం కనీసం జిల్లా కేంద్రాల్లోనైనా గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చెయ్యాలని ఆయన డిమాండ్ చేసారు. కాగా తమ విద్యార్థుల ఉన్నత విద్యకోసం డిగ్రీ గురుకులాలు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, మైనారిటీ గురుకులాల కార్యదర్శి, సంక్షేమ శాఖ కమిషనర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ లకు లేఖల ద్వారా తెలియచేయడం జరిగిందన్నారు.

తాగునీటి సమస్యలపై స్పందించాలి :కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, కొమరం భీం : జిల్లాలో తాగునీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఇంజనీర్లు, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లాలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రాగునీటి సమస్యలపై దినపత్రికలలో, ప్రసార సాధనాలలో వచ్చిన కథనాలపై అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టిన చర్యల సమాచారాన్ని జిల్లా పౌర సంబంధాల అధికారి ద్వారా పత్రికలలో వచ్చే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రతి మండలంలో బుధవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయితీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో త్రాగునీటిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించాలని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా పైలట్ గ్రామాలలో ఎంపిక చేసిన లబ్ధిదారులు తమ ఇండ్ల పనులను ప్రారంభించే విధంగా ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

ఏఈలకు మండలాల కేటాయింపు : కలెక్టర్

విశాలాంధ్ర -ఖమ్మం : గృహనిర్మాణశాఖ బలోపేతం చేస్తూ ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఖమ్మం జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన 14 మంది అసిస్టెంట్ ఇంజినీర్‌లకు మండలాల కేటాయింపు చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మరింత సమర్థవం తంగా అమలు చేసేందుకు తెలంగాణ స్టేట్ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఖమ్మం విభాగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీర్లను కేటాయించిందని కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నూతన ఏఇ లు కలెక్టర్ ని కలిశారు. ఈ సందర్భంగా కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. కామేపల్లి మండలానికి డి. నగేష్, నేలకొండపల్లి మండలానికి వి. లింగా, రఘునాధపాలెం మండలానికి జి. పుష్ప, చింతకాని మండలానికి టి. సుప్రియ, తల్లాడ మండలానికి షేక్ అస్మా, ఏన్కూరు మండలానికి బి. స్నేహ, కల్లూరు మండలానికి ఎస్. సాయి పవన్, వేంసూరు మండలానికి ఎం. శ్రీనివాస్, ముదిగొండ మండలానికి బి. సతీష్, ఎర్రుపాలెం మండలానికి పి. గోపి, సత్తుపల్లి మండలానికి వి. పవన్ కళ్యాణ్, పెనుబల్లి మండలానికి వై. కమల్ ప్రసాద్, కూసుమంచి మండలానికి ఏ. రవి, తిరుమలాయపాలెం మండలానికి కే. మిథున్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్లను కలెక్టర్ కేటాయించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు వెంటనే రిపోర్ట్ చేయాలని, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతలు అప్పగించాలని, వారి పనితీరు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఇఇ భూక్యా శ్రీనివాస్, డిఇలు పాల్గొన్నారు.

విద్యార్థులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మరిపెడ: విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులను ఉపయోగించుకోవాలని తహశీల్దార్ దొడ్డారపు సైదులు అన్నారు. మంగళవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఉన్నత పాఠశాల మరిపెడలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఎంఈఓ గాదె అనితాదేవితో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులు వారికి నచ్చిన అంశాలలో శిక్షణ పొంది మానసిక, శారీరక పరిపక్వతకు పునాదులు వేసుకోవాలన్నారు. సమ్మర్ క్యాంపు కార్యక్రమాల ద్వారా పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడానికి, సెలవులు ఆహ్లాదకరంగా గడుపుకోవడానికి, నూతనమైనటువంటి నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్, గణిత నైపుణ్యాలు, భౌతిక, జీవ శాస్త్ర ప్రయోగాలు, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, చిత్రలేఖనం, పాటలు, నృత్యాలు, ధ్యానం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మొదలగు నేర్పించడా నికి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వాన్ని అభినందించారు. 20 వరకు ఉదయం 8 గంటల నుండి 10:30 గంటల వరకు శిబిరం నిర్వహిస్తాం న్నారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బయగాని రామ్మోహన్, ఉపాధ్యాయులు నంది గామ జనార్ధనాచారి. స్వప్న, శౌరి, ప్రసాదరావు, కీసర రమేష్ రెడ్డి, జహేదా బేగం, సురేష్, రాజకుమారి, అనిత, సుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్య పోరు

విశాలాంధ్ర - చర్ల : సంక్షేమ, అభివృద్ధి పథకాల బట్వాడాలో తేడాలు రావడంతో మండలంలోని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారు. దీంతో ప్రతిపక్ష బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుల మధ్య మండలంలో బహిరంగ పోరు కొనసాగుతుంది. ముఖ్యంగా ఇటీవలే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అర్హులైన వారికీ ఇల్లు రాలేదని చెప్తున్నారు. ఇదే క్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సూచించిన మాత్రం జాబితాలో ఉన్నాయని చెప్తున్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు మండలంలో బిఆర్ఎస్ నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండల కాంగ్రెస్ శ్రేణులు ఆరోపణలు చేస్తున్నారు. దీంతో మండలంలో అధికార పక్షంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. గడచినా ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే వెంకట్రావు కొంత కాలానికే కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బి ఆర్ ఎస్ నాయకులతో ఉన్న సంబంధాలనుతెంచుకోలేక తాను కొత్తగా చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమతుల్యం పాటించలేక పోవడంతో పరస్పరం మనస్పర్ధలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య ఏళ్ళ తరబడి ఉన్న విభేదాలు అధికార పార్టీలో ఇంకా మంటను రేపుతున్నాయి. బిఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యే ఆ పార్టీకి చెందిన వారికె ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు మదన పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక విషయంలో ఈ పరిణామాలకు ఆజ్యం పడింది. మండలంలో అధికార పార్టీలోని విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మండల నాయకులు ఎమ్మెల్యేతో ఏదోలా అడ్జస్ట్ అవుతున్న కార్యకర్తలు మాత్రం అసంతృప్తిగా ఉన్నారు. తొలి నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఇంతకాలం ఎలాంటి పథకాలు అందక అష్ట కష్టాలు పడి తీరా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని చెప్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ని నమ్ముకొని ఉన్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ పార్టీలోని కొంతమంది నాయకులు స్వలాభాపేక్ష ముఖ్యంగా భావించి, కాంట్రాక్టు పనుల కోసం కార్యకర్తలను మండలంలో పట్టించుకునే పరిస్థితి లేదని ఆరోపణలు వస్తున్నాయి. పదేళ్ల నిరీక్షణ తర్వాత అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పటికీ తమకు సంతోషం లేకుండా పోయిందంటున్నారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ లోకి వెళ్ళినప్పటికి తమకేమీ నష్టం లేకపోగా తమ పనులు చక్కదిద్దుకుంటున్నందుకు బిఆర్ఎస్ శ్రేణులు చాలా హ్యాపీగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న పదేళ్ల కాలం భుజాలపై జెండాలు మోసి, అనేక కేసులు ఎదుర్కొల్లు, సొంత డబ్బులు ఖర్చుపెట్టి కాంగ్రెస్ పార్టీని కాపాడుకున్నామని కొందరు నేతలు, కార్యకర్తలు అంటున్నారు. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా తమకు ఈ అవస్థలు దూరం కాకపోవడం తీవ్ర శోభకు గురిచేస్తుందని కొందరు 'విశాలాంధ్ర 'ముందు తమ బాధ వెలగక్కారు. కొందరు కాంగ్రెస్ నాయకులు మాత్రం బిఆర్ఎస్ నేతలతో మిలాఖాత్ అయ్యి తమను పట్టించుకునే పరిస్థితి లేదని కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నాయకులకు రాబోయే స్థానిక ఎన్నికల్లో తామేంటో చూపిస్తామని అధికార పార్టీ కొందరు కార్యకర్తలు అంటున్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు అయినా వాస్తవాలను గ్రహించి తొలి నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కార్యకర్తలను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

బాల్యవివాహం అడ్డుకున్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో -నిర్మల్ జిల్లా : తానూర్ మండలంలోని బోసి గ్రామంలో బాల్యవివాహం జరగబోతున్న సమాచారం అందుకున్న బాలల పరిరక్షణ శాఖ అధికారులు సకాలంలో స్పందించి వివాహాన్ని అడ్డుకున్నారు. బోసి గ్రామానికి చెందిన 14ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బాలల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ముధోల్ సీఐ మల్లేష్, ఎస్సై, సీడిపిఓ సరోజినీ, ఏసీడిపిఓ నాగలక్ష్మి, బాల పరిరక్షణ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు అక్కడికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్యవివాహం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఇద్దరు కుటుంబాల నుంచి కూతురు మేజర్ అయ్యే వరకు వివాహం జరిపించబోమని హామీ పత్రాలు రాసుకున్నారు. ఈ సంఘటనపై స్పందించిన స్థానికులు, బాలిక భవిష్యత్తు దృష్ట్యా చర్యలు తీసుకున్న అధికారులకు అభినందనలు తెలిపారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర - తొర్రూరు: 18 నెలల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తొర్రూరు బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి దయాకర్‌రావు హయాంలో పాలకుర్తి నియోజకవర్గంలోని అనేక మండలాల్లో చేసిన అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకోవడానికి కాంగ్రెస్ యత్నించడం హాస్యాస్పదమన్నారు. తొర్రూరులో మినీ ట్యాంక్ బండ్ పనులు దయన్న హయాంలో మంజూరు అయితే ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటన్నారు. తొర్రూరు పట్టణంతోపాటు, మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ హయాంలో దయన్న చేసిన పనులు తప్ప మరేమీ కనిపించడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడా నక్కకు నాగలోకానికి ఉన్నంత ఉందన్నారు. దయన్న హయాంలో జరిగిన అభివృద్ధిపై, ప్రస్తుత ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పార్టీ అధికారంలోకి రావడానికి చెమట చిందించిన నాయకులను పక్కకు పెట్టి కొత్తగా వచ్చిన నేతలను కూర్చోబెట్టుకున్నారన్నారు. ఆ పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు స్థానం లేదని ఆ పార్టీ కార్యకర్తలకే అర్థమైందన్నారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి పాలన చేత కావట్లేదని చేతులెత్తేశాడని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.ఈ సమావేశంలో పిఎసిఎస్ డైరెక్టర్ జనార్దన్ రాజు, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్,నాయకులు ఈనెపల్లి శ్రీనివాస్, ఎస్.కె అంకుస్, మాలోత్ కాలు నాయక్, లేగల వెంకట్ రెడ్డి, మాచర్ల వెంకన్న,కుమారస్వామి, దామోదర్ రెడ్డి,గోసంగి భాస్కర్, సోమలింగం, పయ్యావుల రామ్మూర్తి, బాబు నాయక్, ఎర్రం రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ) నల్గొండలో 2025-2026 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందుటకు దోస్త్ ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభ మైనదని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళాశాల అన్ని సౌకర్యాలు కలిగి పిహెచ్డి, నెట్, సెట్ లాంటి అర్హత కలిగి అనుభవజ్ఞులైన కళాశాల బోధన సిబ్బంది, డిజిటల్ మరియు వర్చువల్ క్లాస్ రూమ్ లు మాత్రమే కాకుండా విశాలమైన తరగతి గదులు, అత్యాధునికమైన లాబరేటరీలు, పూర్తిగా డిజిటలైజేషన్ చేయబడి 25 వేల పైచిలుకు పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పుస్తకాలే కాకుండా ఉర్దూ మీడియం విద్యార్థినులకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు అందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండలో ప్రథమ సంవత్సరంలో చేరుటకు మొదటి ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా కోరారు. కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ మాట్లాడుతూ, చదువుతోపాటు విద్యార్థులకు అతిపెద్ద జిమ్, క్రీడా ప్రాంగణం, ఉచిత బస్సు పాస్ సౌకర్యం తో పాటుగా ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం అందుబాటులో ఉన్నదని, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు ఆసక్తిగల విద్యార్థులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకొని కళాశాలలో చేరి తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. దోస్త్ అడ్మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ (7799910222), కళాశాల అడ్మిషన్ మెంబర్ డాక్టర్ జబీన్ (7799668960), కళాశాల దోస్త్ టెక్నికల్ సిబ్బంది రమేష్ (9491662435), నవీద్ (7013221372) మొబైల్ నెంబర్ లపై సంప్రదించాలని కోరారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర కారేపల్లి : ఆశా వర్కర్లకు కనీసవేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికచట్టాలను రద్దును నిరసిస్తూ ఈనెల 20 కార్మిక సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు కారేపల్లి మండల ఆశా వర్కర్లు మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ సురేష్‌కు నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్ల కనీసవేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించటం లేదన్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సేవలు, వైద్య సర్వేలు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లపై వివక్ష వీడాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న జరిగే సమ్మెలో పాల్గనాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో హెల్త్‌వర్కర్స్‌యూనియన్ నాయకురాళ్లు ఎల్లెబోయిన రాధ,జంగ కళ్యాణి, పద్మ, రాజేశ్వరి,ఆదెర్ల దేవకరణ, సిహెచ్.పుష్పలత ఈశ్వరి, మంగ, కుమారి, సరస్వతి, చంద్రమ్మ, నర్సమ్మ పాల్గన్నారు.

14 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగుబాటు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట మంగళవారం లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి లొంగిపోయిన వారిని ప్రదర్శించారు. జిల్లా పోలీసులతోపాటు ఆర్ టి ఐ ఎన్, 41 సిఆర్పిఎఫ్ బెటాలియన్ అధికారులు ఏజెన్సీ ప్రాంతాలు ఆదివాసుల కోసం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు "ఆపరేషన్ చేయూత" కార్యక్రమాల వల్ల మావోయిస్టులు లొంగిపోతున్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్ని సౌకర్యాల గురించి కూడా అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లు జల జీవన స్రవంతిలో కలవడానికి లొంగిపోతున్నట్టు ఎస్పీ తెలిపారు. కుటుంబ సభ్యలతో కలిస ప్రశాంతమైన జీవితం గడపాలని కోరారు. మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఈ 14 మంది సభ్యుల్లో ముగ్గురు మహిళ ఉన్నట్లు తెలిపారు. గతంలో లొంగిపోయిన సభ్యులకు ప్రభుత్వం మెరుగైన పునరావాస సౌకర్యాలు కల్పించిందన్నారు. అందుకే మిగతావారు కూడా ఆయుధాలు వీడి లొంగబాట పడుతున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ తో పాటు బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

నాలుగు యుద్ధాలు ఒక నిర్ణాయక విజయం

పహల్గాం లో ఏప్రిల్ 22వ తేదీన తీవ్రవాదుల ఘాతుకం భారత-పాకిస్థాన్ సంబంధాలు తీవ్రంగా బెడిసిపోయేట్టు చేసింది. ఈ దాడి తరవాత సింధు నది జలాల ఒప్పందాన్ని స్థగితం చేశారు. అట్టారి-వాఘా సరిహద్దును మూసివేశారు. దౌత్య సంబంధాలు నిలిచిపోయాయి. పాకిస్థాన్‌ను మట్టిగరిపిస్తాం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనడంతో పాకిస్థాన్ మీద యుద్ధం అనివార్యం అన్న అభిప్రాయం కలిగింది. దేశవాసుల్లో అనేక మంది పాకిస్థాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పాలంటే యుద్ధం ఒక్కటే మార్గం అన్న అభిప్రాయంతో ఉన్నారు. ఈ అభిప్రాయానికి రావడానికి కారణం పాకిస్థాన్ ముస్లిం దేశం కావడమే ప్రధాన కారణం. ముస్లింలను ద్వేషించడానికి కావలసిన భూమిక గత పదకొండేళ్ల మోదీ పాలనలో బలంగా ఏర్పడింది. పాకిస్థాన్‌ను మన దేశం మీద తీవ్రవాదులను ఉసి గొల్పుతున్న దేశంగా కాక ముస్లింల మీద కక్ష తీర్చుకోవాలన్న కసి చాలామందిలో పెరిగిపోయింది. యుద్ధం ప్రకటించకుండా మోదీ తాత్సారం చేస్తున్నారన్న భావనలూ చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం (మే 7వ తేదీ) మాక్ డ్రిల్లులు నిర్వహించాలని రాష్ట్రాలను కోరింది. ఇది మన యుద్ధ సన్నద్ధతను బేరీజు వేయడానికి ఉపకరిస్తుంది. ఈ లోగా పాకిస్థాన్ తమకు తోచిన చర్యలు తీసుకుంటోంది. తన సరిహద్దులను పటిష్ఠం చేస్తోంది. పహల్గాం సంఘటన జరిగి 15 రోజులు గడిచినా యుద్ధం జరగకపోవడం సానుకూల అంశమే. పాకిస్థాన్ ఆగడాలను నిరోధించడానికి యుద్ధం పరిష్కారం కాదని గత చరిత్ర నిరూపిస్తోంది. పాకిస్థాన్ కన్నా మన సైనిక శక్తి ఎక్కువే. సందేహం లేదు. కానీ రెండు దేశాల దగ్గరా అణ్వస్త్రాలు ఉన్నాయన్న వాస్తవాన్ని రెండు పక్షాలూ గమనించవలసిందే. 1947లో స్వాతంత్ర్యం సంపాదించినప్పటి నుంచి భారత పాకిస్థాన్ మధ్య అనేక సార్లు ఘర్షణలు జరిగాయి. ఇవన్నీ యుద్ధ స్థాయిలో లేకపోవచ్చు. ఈ ఘర్షణలకు కేంద్ర బిందువు కశ్మీరే. స్వాతంత్ర్యం సాధించిన వెంటనే 1947-48లో పాకిస్థాన్ మన దేశం మీద యుద్ధానికి దిగింది. కానీ ఆ యుద్ధం ప్రతిష్ఠంభనగానే మిగిలి పోయింది. మనం కశ్మీర్‌లోని కొంత భాగాన్ని కోల్పోయాం. దాన్నే ఆక్రమిత కశ్మీర్ అంటున్నాం. అప్పుడు కాల్పుల విరమణ జరిగింది. అధీనరేఖ అమలులోకి వచ్చింది. ఆక్రమిత కశ్మీర్ అన్న మాటే మన వైఫల్యానికి నిదర్శనం. అప్పటి పరిస్థితులు ఏమైనా కావచ్చు. కానీ మనం కొంత భూభాగం కోల్పోయామన్నది వాస్తవం. ఆ తరవాత 1965లో మరోసారి రెండు దేశాల మధ్య యుద్ధం జరిగింది. తాష్కెంట్ ఒప్పందం కారణంగా యుద్ధం ముగిసినా ఆ యుద్ధ ఫలితం ప్రతిష్టంభనకే దారి తీసింది. తమ భాష, సంస్కృతులను పరిరక్షించుకోవడానికి పశ్చిమ పాకిస్థాన్‌లో కూర్చున్న పాక్ పాలకుల దాష్టీకాలకు వ్యతిరేకంగా ముజిబుర్ రహమాన్ నాయకత్వంలో మహోద్యమం కొనసాగింది. 1971లో జరిగిన యుద్ధంలో మనం బంగ బంధు ముజీబ్ కు మద్దతిచ్చాం. ఈ క్రమంలో జరిగిన యుద్ధం పర్యవసానంగానే బంగ్లాదేశ్ అవతరించింది. పాకిస్థాన్ రెండు ముక్కలైంది. ఈ దృష్టితో చూస్తే మనం నిర్ణాయక విజయం సాధించనట్టే లెక్క. 1999లో జరిగిన యుద్ధంలో పాక్ సేనలు ఆక్రమించిన భూభాగాన్ని కాపాడుకోగలిగాం. కానీ ఇది పరిమిత యుద్ధమే. మనం పాక్ భూభాగంలోకి వెళ్లకుండానే మన లక్ష్యం సాధించాం. 1984-2003 మధ్య సియాచిన్ ఘర్షణ, 2001-2002 పార్లమెంటు మీద దాడి కారణంగా భారత-పాకిస్థాన్ మధ్య ప్రతిష్టంభన కారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగింది.

ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించిన మన పాలకులకు కొదవలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే మాట చెప్తోంది. 1971 యుద్ధంలో మన సేనలు లాహోర్ దాకా వెళ్లాయి కానీ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునే ప్రయత్నమే చేయలేదు. 2001-2002లో పాకిస్థాన్ తీవ్రవాదులు భారత పార్లమెంటు భవనంపై దాడికి తెగబడ్డారు. దాడికి పాల్పడ్డ వారిని మన భద్రతా దళాలు అక్కడికక్కడే కాల్చి చంపాయి. చివరకు దౌత్య మార్గాల ద్వారానే ఆ ప్రతిష్టంభన తొలగి పోయింది. 2008లో ముంబై మీద పాక్ తీవ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడులకు పాకిస్థాన్‌లోని తీవ్రవాదులే కారణం అన్న భావనకు బలం చేకూరింది. అప్పుడు పాకిస్థాన్ సరిహద్దుల్లోకి సైన్యాన్ని పంపింది. వైమానిక దళాలను సన్నద్ధం చేసింది. మళ్లీ దౌత్య మార్గంలోనే ఉద్రిక్తతలు తగ్గాయి. 2016లో ఊరిలో భారత సైనిక శిబిరంపై దాడి జరిగినప్పుడు భారత్ "సర్జికల్ స్ట్రైక్" చేసిందంటున్నారు. దీనివల్ల ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. 2019లో పుల్వామా దాడి జరిగింది. ఈ దాడిలో మన సీఆర్‌పీ జవాన్లు దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తరవాత పాకిస్థాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి మన దళాలు దాడి చేశాయి. అప్పుడు పాకిస్థాన్ సైన్యం మన పైలెట్‌ను బందీగా పట్టుకుంది. ఆ తరవాత విడుదల చేసింది. పాకిస్థాన్ వైమానిక దాడులకు దిగింది. అప్పుడు ఉద్రిక్తత తీవ్ర స్థాయికి చేరింది. 2019 ఆగస్టు 5న మోదీ ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దు చేసింది. ఆ సమయంలో కాల్పుల విరమణకు అనేక సార్లు భంగం కలిగింది. ఈ యుద్ధాల చరిత్ర రెండు దేశాల మధ్య వివాదాలు సమసి పోయేట్టు చేసిన దాఖలాలైతే లేవు. పహల్గాం దాడుల తరవాత కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌కు సింధు నదీ జలాలు అందకుండా చేస్తామని హుంకరించింది. కానీ ఇది సాధ్యమయ్యే పని కాదని తేలిపోయింది. పహల్గాం ఘాతుకాన్ని అనేక దేశాలు ఖండించిన మాట వాస్తవమే. కానీ మనం పాకిస్థాన్ మీద నిజంగా యుద్ధానికి దిగితే ఈ దేశాల్లో అనేకం మనకు అండగా నిలబడే అవకాశం కనిపించడం లేదు. మాట వరసకు మద్దతివ్వడం వేరు. ఆచరణలో యుద్ధానికి దిగినప్పుడు అండగా ఉండడం వేరు. చైనా మాత్రం పాకిస్థాన్‌కు అండగా ఉంటానంటోంది. కానీ యుద్ధం జరిగే పరిస్థితే వస్తే చైనా కూడా పాకిస్థాన్ తరఫున యుద్ధంలో భాగస్వామి అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. మనం సింధు నదీ జలాలను స్థగితం చేస్తామంటే పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేస్తామంటోంది. నిజానికి సిమ్లా ఒప్పందాన్ని పాకిస్థాన్ పాటించిన సందర్భాలే తక్కువ. ఈ ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించి పాకిస్థాన్ ద్వైపాక్షిక అంశానికి కట్టుబడాలన్న సూత్రాన్ని జవదాటి అంతర్జాతీయ వేదికల మీద అనేకసార్లు కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. ఇలాంటి విషయాలలో గానీ, మన దేశంలో తీవ్రవాదాన్ని రెచ్చగొట్టండంలో కానీ పాకిస్థాన్ ఏనాడూ నియమాలకు కట్టుబడింది లేదు. ఇలాంటి వైఖరిని చూపించడానికి యుద్ధం పరిష్కారం కాదు. దౌత్యపరంగా ఒత్తిడి తీసుకోవడం ఒక్కటే మార్గం.

వియత్నాం అద్భుత అభివృద్ధి

కె.రామకృష్ణ
సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

> "వియత్నాంతో సరితూగగల పోరాటం ప్రపంచంలో ఎక్కడా జరగలేదని చెప్పవచ్చు. ఆ దేశ వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకం. విద్య, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో వియత్నాం ఎంతో విశిష్టత సాధించింది. ప్రపంచంలో సంపదగల, పేద, పెద్ద దేశాలున్నప్పటికీ వాటిన్నికంటే ఇంత త్యాగం చేసిన దేశం మరొకటి లేదు. అమెరికా వినియోగించిన రసాయనిక ఆయుధాల ఫొటోలతో కూడిన వార్ మ్యూజియం అమెరికా నాటి దుశ్చర్యలను కళ్లకట్టినట్టు చూపింది.

హోచిమిన్ విగ్రహం

వియత్నాం పేరు వినగానే, ఒక గొప్ప పోరాట చరిత్ర మన కళ్లముందు మెదులుతుంది. ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు చూసిన, ఎంతో సహనాన్ని, త్యాగాన్ని నిలబెట్టుకున్న దేశం వియత్నాం మాత్రమే. ఇటీవలే హోచిమిన్ సిటీలో జరిగిన వియత్నాం పునరేకీకరణ 50వ వార్షికోత్సవ కార్యక్రమానికి వియత్నాం ప్రభుత్వ ఆహ్వానంపై హాజరై వచ్చాను. అక్కడి అనుభవాలు, చరిత్ర, ప్రజల చైతన్యం నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి థు లామ్‌ను మన భారతీయ సంప్రదాయం ప్రకారం సత్కరించే అవకాశం కలిగింది. వియత్నాం ఆగ్నేయ ఆసియాలోని ఒక దేశం. 2016 జనాభా లెక్కల ప్రకారం ఈ దేశ జనాభా సుమారు 9 కోట్ల 46 లక్షలు. జనసంఖ్యలో ప్రపంచంలో 15వ స్థానంలో, ఆసియాలో 9వ స్థానంలో ఉంది. 1976లో ఉత్తర, దక్షిణ వియత్నాంలు కలిసిపోయినప్పటి నుంచి హనోయ్ నగరం రాజధానిగా ఉంది. హోచిమిన్ నగరం అత్యధిక జనాభా గల నగరం. యుద్ధంతో సర్వం కోల్పోయి తాగేందుకు మంచినీరు లేని వియత్నాం... ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందింది. నేటి వియత్నాంను చూస్తుంటే అక్కడ యుద్ధం జరిగిందా? లేదా? అనే సందేహం కలుగుతోంది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్, చికాగో తదితర నగరాలకు దీటుగా వియత్నాం రాజధాని హోచిమిన్ నగరం అభివృద్ధి చెందింది.

సైనిక విన్యాసాలు

అమెరికా సామ్రాజ్యవాదులపై సుదీర్ఘకాలం పోరాడిన అద్భుతమైన విప్లవగాథ వియత్నాంది. అమెరికాతో యుద్ధం ముగిసి... ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం ఏకీకరణ జరిగి ఏప్రిల్ 30వ తేదీకి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఉత్సాహపూరిత వాతావరణంలో వేడుకలు జరిగాయి. చారిత్రక హోచిమిన్ నగరం ఎరుపెక్కింది. నగర వీధులన్నీ జనంతో కోలాహలంగా మారాయి. జాతీయ పతాకాలతో ప్రజలు వేడుకల్లో పాల్గొని, తమ అభిమానాన్ని చాటుకున్నారు. వియత్నాం విప్లవ యోధుడు హోచిమిన్ చిత్రపటం, వియత్నాం చిహ్నం 'ల్యాక్ బర్డ్'తో సైన్యం కదం తొక్కారు. హో చి మిన్ నగర వీధుల్లో పరేడ్ ముందుకు సాగగా, వేలాది మంది ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా శాంతిపై దృష్టితో ముందుకెళుతున్నట్లు నాయకులు సందేశమిచ్చారు. ఒకప్పుడు సైగన్‌గా పిలిచే హో చిమిన్ నగర వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. యుద్ధానికి ముగింపు పలికిన చోటు 'ఇండిపెండెన్స్ ప్యాలెస్' వద్ద యుద్ధ విమానాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలలో వివిధ దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. భారతదేశం నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి మాత్రమే అధికారికంగా ఆహ్వానం అందింది. సీపీఐ ప్రతినిధిగా నేను హాజరుకావడం నాకు ఎంతో గర్వకారణం. ఈ వేడుకల్లో శాంతి, ఐక్యత, జాతీయ అభివృద్ధి అంశాలు ప్రధానంగా ప్రతిధ్వనించాయి. ప్రతినిధులలో విదేశీ సైనిక బృందాలు, యుద్ధంలో పాల్గొన్న యోధులు ఉన్నారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన 30 ఏళ్ల పోరాటం ముగింపునకు, వలసవాదం అంతానికి ఏప్రిల్ 30వ తేదీ చరిత్రలో నిలిచిందన్నారు. భావి తరానికి మెరుగైన ప్రపంచాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందుకోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు టూ లామ్ వెల్లడించారు.

వియత్నాంతో సరితూగగల పోరాటం ప్రపంచంలో ఎక్కడా జరగలేదని చెప్పవచ్చు. ఆ దేశ వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకం. విద్య, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో వియత్నాం ఎంతో విశిష్టత సాధించింది. ప్రపంచంలో సంపదగల, పేద, పెద్ద దేశాలున్నప్పటికీ వాటిన్నికంటే ఇంత త్యాగం చేసిన దేశం మరొకటి లేదు. అమెరికా వినియోగించిన రసాయనిక ఆయుధాల ఫొటోలతో కూడిన వార్ మ్యూజియం అమెరికా నాటి దుశ్చర్యలను కళ్లకట్టినట్టు చూపింది.

టన్నెల్స్: హోచిమిన్ సిటీలోని కుచ్ జిల్లాలో సుమారు 250 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భూగర్భ టన్నెల్స్ మానవ శక్తి ఎంత దృఢంగా ఉండగలదో చూపిస్తున్నాయి.

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి థు లామ్‌ను సత్కరించిన రామకృష్ణ

ఇవి గెరిల్లా యుద్ధ కేంద్రాలుగా, ఆయుధ నిల్వ కేంద్రాలుగా, ఆసుపత్రులుగా, వంట గదులుగా, రాజకీయ సమావేశం గది లాగా యుద్ధకాలంలో ఉపయోగించేవారు. 1940లో మొదట ఫ్రెంచ్ వలస పాలనకు ప్రతిఘటనగా తవ్విన టన్నెల్స్, అమెరికాతో యుద్ధంలో మరింతగా పెంచి ఉపయోగించారు.

"దోయ్ మోయ్"తో పునర్నిర్మాణం: 1975 యుద్ధం తర్వాత వియత్నాం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు 1986లో ప్రారంభించిన "దోయ్ మోయ్" ఆర్థిక సంస్కరణల ద్వారా, వియత్నాం కేంద్ర ప్రణాళిక విధానాల నుంచి మార్కెట్ ఆధారిత విధానాలవైపు సాగింది. అయితే, ప్రజల అవసరాలే కేంద్రబిందువుగా కొనసాగాయి. ఫలితంగా పేదరికం 70శాతం నుంచి 1.9శాతానికి తగ్గింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కొత్త పుంతలు తొక్కి విజయవంతం కాగలిగింది. విదేశీ పెట్టుబడులకు అవకాశాలు ఇచ్చినప్పటికీ ప్రజల ప్రయోజనాలే కేంద్రంగా ఉంటున్నాయి. 1990 తర్వాత వియత్నాం జీడీపీ 6శాతానికి పైగా పెరుగుతూనే ఉంది. 2024లో వియత్నాం జీడీపీ 476.3 బిలియన్ డాలర్లుగా నమోదైంది, ఇది 2023లోని 5.05శాతం వృద్ధితో పోలిస్తే 7.09శాతం వృద్ధిని సూచిస్తోంది. ఎగుమతులు 14.3శాతం పెరిగి 405.53 బిలియన్ డాలర్లకు చేరాయి, దేశ ఆర్థిక వృద్ధికి ఇది ముఖ్య కారణం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 9.4శాతం పెరిగి 25.35 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసింది. ఇదంతా కమ్యూనిస్టు పాలనలో వియత్నాం సాధించిన అభివృద్ధి.

వియత్నాంలో సైన్యానికి, యువతకు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనబడింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన సౌత్, నార్త్ వియత్నాంల ఏకీకరణ 50వ వార్షికోత్సవంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్, ఆర్మీ మేజర్ జనరల్ చాన్ నాక్ థు తో పాటు యువత తరఫున ఒక యువతి మాట్లాడడం చూస్తే ఆ దేశంలో యువతకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో అర్థమవుతోంది. వియత్నాంలో కమ్యూనిస్టుపార్టీ తప్ప వేరే పార్టీ లేదు. వియత్నాం ప్రభుత్వ విధానాలు కమ్యూనిస్టులే కాకుండా కమ్యూనిస్టేతరులనూ అకట్టుకుంటున్నాయి.

వియత్నాం విజయం సైనికమైనదేగాక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విజయవంతమైన ప్రయోగం. ప్రజల చిత్తశుద్ధి, నాయకత్వ నిబద్ధత, గణనీయమైన యువత పాత్ర, భాగస్వామ్య పాలన వంటి అంశాలు, భారత్ వంటి దేశాలు నేర్చుకోవాల్సిన అంశాలు. పారదర్శకతతో కూడిన కమ్యూనిజం ఎలా ప్రజల మద్దతుతో విజయవంతమవుతుందో అన్నదానికి వియత్నాం ఉదాహరణ. అంతిమంగా చెప్పాల్సిందేమంటే విజయం అనేది సాధన కాదు, అది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే. ఈ ఉత్సవాలకు స్పెయిన్ నుంచి వచ్చిన మహిళా ప్రతినిధి నా పక్కనే కూర్చుని వున్నప్పుడు "ఇక్కడ ప్రతిపక్షం లేకుండా ప్రజల అసంతృప్తి వంటివి ఉండవా?" అన్న చర్చ వచ్చింది. దానికి ఆమె సమాధానమిస్తూ, "ప్రజలను పాలనలో భాగస్వాములుగా చేసి వారికి అవసరమైనవి సమకూర్చగలిగితే వారిలో అసంతృప్తికి చోటుండదు. బహుళ పార్టీ వ్యవస్థతో వాళ్లకు పనీ లేదు" అని పేర్కొన్నారు. ఇది వియత్నాం విజయ రహస్యానికి అద్భుతమైన వ్యాఖ్యానం.

రసాయనాల పీడ

యుద్ధంలో అమెరికా 'ఏజెంట్ ఆరంజ్' లాంటి రసాయనాలు వాడి వియత్నాంను గెలవాలనుకుంది. అయినా వియత్నాం వీరులు వాటిని ఎదుర్కొన్నారు. వీటివల్ల 3 మిలియన్ల మంది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. కేన్సర్, జనన లోపాలు, శారీరక వైకల్యాలు యుద్ధం ముగిసిన తర్వాత పుట్టిన తరాలపైన కూడా ప్రభావం చూపించాయి.

వలసల నుంచి విజయవంతమైన ప్రజా పాలన దిశగా

వియత్నాం చరిత్ర అనేది వలస పాలనలపై తిరుగుబాటు, స్వతంత్ర ఉద్యమాల విజయం, ప్రజా కేంద్రిత పాలన వికాసాన్ని చూపిస్తుంది. ఫ్రెంచ్ వలస పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత కొరియా, అమెరికాలతో మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన యుద్ధాలను వియత్నాం ఎదుర్కొంది. అమెరికాతో జరిగిన యుద్ధంలో 30 లక్షల మంది చనిపోయారు. 20 లక్షల మంది గాయపడ్డారు. 3 లక్షల మంది కనిపించకుండా పోయారు. అధునాతన యుద్ధ సామాగ్రి వున్న అమెరికాతో తలపడి 59 వేలమంది అమెరికన్ సైనికులను హతమార్చింది. ఇది వారి పోరాట శక్తికి నిదర్శనం. ప్రపంచ యుద్ధంలో అమెరికా 50 లక్షల టన్నులు, కొరియా యుద్ధంలో 26 లక్షల టన్నుల బాంబులు వినియోగించగా... ఒక్క వియత్నాం యుద్ధంలో ఏకంగా కోటి 43 లక్షల టన్నుల బాంబులను అమెరికా ఉపయోగించాల్సి వచ్చింది. 17 ఏళ్ల 2 నెలలపాటు వియత్నాం వీరోచితంగా పోరాడి అమెరికా సామ్రాజ్యవాదుల మెడలు వంచింది. ఈ యుద్ధం కోసం 676 బిలియన్ డాలర్లను అమెరికా ఖర్చుచేసింది.

స్పెయిన్ ఇతర దేశాల ప్రతినిధులతో రామకృష్ణ

వార్షికోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న యువత

కార్మిక బాంధవుడు పిల్లలమర్రి

దోనేపూడి శంకర్



పిల్లలమర్రి వెంకటేశ్వర్లు కార్మిక బాంధవుడు. మద్రాసు శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ తరఫున ఎన్నికైన ఏకైక శాసన సభ్యుడు. అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలాచారిని నిండు శాసనసభలో ఆయన పెట్టుకున్న నల్ల కళ్ళజోడు తీసి వాస్తవాలు చూడమని గర్జించినవాడు. ఆంధ్ర రాష్ట్ర తొలి తరం కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరు. 1912లో గుంటూరు జిల్లా శిష్టా వారి మంచాడా అగ్రహారంలో పుట్టిన పిల్లలమర్రి 1933-34 లో ఇంటర్మీడియట్ పరీక్ష తప్పారు. పరీక్ష పాస్ అవ్వాలని తెనాలి వచ్చి రోజూ గ్రంథాలయానికి వెళ్లి అధ్యయనం చేసేవారు. కాంగ్రెస్ నాయకుల ఉపన్యాసాలు విని ప్రభావితులయ్యారు. భగత్ సింగ్‌కు మరణశిక్ష రద్దు చేయించాలని భారత దేశ యువజనులు దేశవ్యాపితంగా ఆందోళన చేసినా మహాత్మా గాంధీ అలా చేయకపోవడంతో గాంధీ సిద్ధాంతాలపైన పిల్లలమర్రికి నమ్మకం సడలింది. తెనాలిలో పోలేపెద్ది నరసింహామూర్తి ప్రభావంతో మార్క్సిజంవైపు ఆకర్షితులయ్యారు. తెనాలిలో వున్న మునిసిపల్ వర్కర్స్, ఫ్యాక్టరీ వర్కర్లని సంఘాలుగా నిర్మాణంచేసే బాధ్యత పిల్లలమర్రికి పోలేపెద్ది అప్పగించారు. గుంటూరులో ఆనాడు కమ్యూనిస్టు నాయకులుగా జొన్నలగడ్డ రామలింగయ్య, దుర్భా కృష్ణమూర్తి, ప్రతాప రామసుబ్బయ్య నాయకులుగా వున్నారు. వారితో పరిచయాలు కూడా పిల్లలమర్రిని ప్రభావితం చేశాయి. పోలేపెద్ది నరసింహామూర్తి పిల్లలమర్రిని విజయవాడకు పార్టీలో పనిచేసేందుకు పంపించారు. పార్టీ ఆఫీసులోనే వుంటూ పార్టీ కార్యకలాపాలు నిర్వహించారు. ఆ సమయంలో దత్-బ్రాడ్లీ థీసిస్ గురించి, కమ్యూనిస్టు విధానాల గురించి మద్రాసులో ప్లీనం జరిగింది.

ఆ తర్వాత 1936లో జరిగిన కాకినాడ సమావేశంలో దత్-బ్రాడ్లీ థీసిస్ ఆధారంగా కమ్యూనిస్టు పార్టీ పంథా రూపొందింది. అప్పుడు విజయవాడ పట్టణ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా వున్న కృత్తివెంటి కుటుంబరావుతో పిల్లలమర్రి, గెల్లి రాజగోపాలం కమిటీ సభ్యులుగా ఉండి పనిచేశారు. రాష్ట్ర యువజన ఉద్యమంలో పిల్లలమర్రి చేసిన కృషి మరువలేనిది. రాష్ట్రవ్యాప్తంగా యువజనోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. కృష్ణాజిల్లా యువజన సంఘం కార్యదర్శిగా పిల్లలమర్రి, అధ్యక్షులుగా పిడికిటి మాధవరావు గట్టి కృషి చేశారు. ఆంధ్రదేశంలో కార్మిక ఉద్యమం నిర్మించడంలో పిల్లలమర్రి కృషి విశిష్టమైనది. పిల్లలమర్రి స్థాపించిన లేబర్ ప్రొటెక్షన్ లీగ్ తర్వాత కాలంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కౌన్సిలుగా రూపు దిద్దుకుంది. అప్పుడు సీవీకే రావు అధ్యక్షులుగా, పిల్లలమర్రి కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు. పోలేపెద్ది నరసింహామూర్తి ట్రేడ్ యూనియన్ రంగానికి ఇంచార్జి. ఈ సంస్థ కింద తోళ్ల పనివారి సంఘం, మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటు చేశారు. రాష్ట్రం మొత్తం మీద ప్రెస్ వర్కర్స్ యూనియన్ స్థాపించారు. ఏలూరులో జూట్ వర్కర్స్ యూనియన్, చీరాలలో టుబాకో వర్కర్స్ యూనియన్ నిర్మించారు. రాష్ట్రంలోనే తొలి కమ్యూనిస్టు సెల్ ఏర్పాటు చేసిన ముత్తేవి మాధవాచార్య కూడా పిల్లలమర్రికి స్ఫూర్తి ఇచ్చారు.

1946 మార్చిలో మద్రాసు శాసనసభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సర్వసాధారణ కార్మిక నియోజకవర్గం తరఫున శాసనసభకు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మద్రాసు శాసనసభకు 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం ఎన్నికైన సభ్యులు పిల్లలమర్రి. ఆయన మద్రాసు శాసనసభ సభ్యుడిగా కొనసాగుతుండగా మద్రాసు ప్రజాశాంతి సంరక్షణ చట్టం ప్రకారం జారీ చేసిన ఆదేశాల మేరకు 1948 నవంబరు 7న అరెస్టు అయ్యారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉన్నందున పార్టీని నిషేధించిన తర్వాత అరెస్టు చేశారు. కడలూరు సెంట్రల్ జైలులో అక్రమ నిర్బంధంలో పెట్టారు. 1951లో జరిగిన ఎన్నికల్లో జగ్గయ్యపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 1955, 1962 ఎన్నికల్లో కూడా గెలుపొందారు. పిల్లలమర్రి దాదాపు యాభై ఏళ్ల పార్టీ జీవితంలో పార్టీ విధానాలకు కట్టుబడి పార్టీలోనూ, అసెంబ్లీలోను కృషిచేశారు. మన దేశ చరిత్ర, సంస్కృతి, తత్త్వ శాస్త్రాలను అధ్యయనం చేయాలనీ, భారతీయ మనస్తత్వాన్ని అవగాహన చేసుకోవాలని పిల్లలమర్రి చెప్పేవారు. పిల్లలమర్రి 2000 సంవత్సరంలో కన్నుమూశారు. ఆయన జీవితం నేటి యువతకు, కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శం కావాలి. అటువంటి మహానేత విగ్రహాన్ని శాసనసభకు ఆయన ప్రాతినిధ్యంవహించిన జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసేందుకు విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిస్వార్థ ప్రజాసేవకుడు అయిన పిల్లలమర్రి విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు.

- కార్యదర్శి, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా

ఇ-మెయిల్

ఒకరికి ఒకన్యాయం... మరొకరికి ఇంకొక న్యాయమా?

గత ప్రభుత్వంలో స్వరూపానందకు ఇచ్చిన భూములను, తప్పుడు జీవోలతో తక్కువ రేటుకి ఇచ్చిందని స్వాధీనం చేసుకున్న రాష్ట్రంలోని ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం, నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని చెరువు సర్వే నంబరు 879 లోని చెరువు పోరంబోకును, సర్వే నంబరు 883 లోని అటవీభూమిలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న అనాథ పిల్లల స్కూలు పేరుతో, దొంగస్వామి అక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలని నాటి ప్రిన్సిపల్ సెక్రటరి ఉషారాణి మెమో నంబరు 15358 / తో ఆదేశమిచ్చి నాలుగు సంవత్సరాలు గడచింది. కలెక్టరు పంపిన అలయ్ నేషన్ రద్దుచేసి, స్వాధీనం చేసుకోవాలని అదేశం ఇచ్చారు. ఆ జీఓ ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు. ఎందుకో తెలియదు. ఈ విషయమై ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పదకొండునెలల కాలంలో ఇప్పటికి దాదాపు పదిసార్లు ఫిర్యాదు చేశాను. సీఎంఓ కార్యాలయం నుంచి అప్పుడప్పుడు మీ ఫిర్యాదు స్వీకరించాం, సమస్య తీరిందా అని అడుగుతారు. తీరలేదు అని చెప్తాను. ఇక పురోగతి ఉండదు. చాలా నెలలుగా ఇదే పరిస్థితి. అయితే గుడ్లూరు తహసీల్దార్ రెండవ అలయ్ నేషన్ పంపి దొంగస్వామికి ప్రభుత్వభూమి దారాదత్తం చెయ్యాలని చూస్తున్నారు. ఒకసారి ప్రిన్సిపల్ సెక్రటరి అలయ్ నేషన్ రద్దుచేస్తే, రెండవసారి తహసీల్దారు అలయ్ నేషన్ పంపటానికి ఎంత ధైర్యం! ప్రభుత్వ అధికారులు దొంగస్వామి అశ్రమం వారితో కుమ్ముక్కు అయ్యారు అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? ప్రిన్సిపల్ సెక్రటరి 2021 ఫిబ్రవరి నాడు సుప్రీంకోర్టు తీర్పులను, హైకోర్టు తీర్పులను పరిశీలించి, ఉన్నతాధికారులందరితో సంప్రదించి, దొంగస్వామి అక్రమణలోని భూములను స్వాధీనం చేసుకోవాలని అదేశాలు జారీచేసింది. ఇప్పటికయినా జిల్లా అధికారులు దొంగస్వామి ప్రలోభాలకు, వత్తిళ్లకు లోనుకాకుండా ప్రిన్సిపల్ సెక్రటరి అదేశాలు అమలుపరచి, అక్రమణలోని భూములను స్వాధీనం చేసుకుంటారని ఆశిద్దాం.

నార్నె వెంకటసుబ్బయ్య
అధ్యక్షుడు, భారత హేతువాద సంఘం

ఉగ్రదాడి బాధిత కుటుంబానికి రాహుల్ పరామర్శ

చండీగఢ్: పహల్గాం ఉగ్రదాడిలో కన్నుమూసిన నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం పరామర్శించారు. హర్యానాలోని నర్వాల్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. హర్యానాకు చెందిన వినయ్- హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యతో కలిసి జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్నప్పటికీ తమ వీసాలు రిజెక్ట్ కావడంతో ఆ జంట జమ్మూకశ్మీర్‌కు వచ్చింది. ఉగ్రదాడితో ఆమె కలలన్నీ కల్లలయ్యాయి.

ఐరాసతో ఒరిగేదేమీ లేదు: శశిథరూర్

న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై ఐరాస భద్రతా మండలి సమావేశంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మంగళవారం స్పందించారు. సభ్యదేశాల సంప్రదింపుల తర్వాత ఐరాస భద్రతామండలి ఎలాంటి తీర్మానాన్ని ఆమోదించదని థరూర్ అన్నారు. 'పాకిస్థాన్‌ను విమర్శిస్తూ ఏ తీర్మానం చేసినా దాన్ని చైనా వీటోతో అడ్డుకుంటుంది. భారత్‌ను విమర్శిస్తూ తీర్మానం చేసినా చాలా దేశాలు అడ్డుకుంటాయి. శాంతి కోసం పిలుపునివ్వడం, ఉగ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేయడం వంటి సాధారణ భాష వినిపిస్తుంది' అని అన్నారు. ఇంతకుమించి ప్రత్యేకంగా ఏమీ ఉండకపోవచ్చని అంచనావేశారు. ఇదంతా విచారకరమైన వాస్తవమని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అందులో సింధూజలాల ఒప్పందం అమలు నిలిపివేత ఒకటి. ఈ తరుణంలో ఐరాస సమావేశం జరిగింది. భారత్‌కు వ్యతిరేక తీర్మానం చేయాలని తొలుత పాక్ భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇస్లామాబాద్ బహిరంగ అణు బెదిరింపులపై చాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల ఆ దేశం క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని ప్రశ్నించాయి.

పాక్ ఆర్థిక మూలాలపై భారత్ దెబ్బ

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌ను ఆర్థికంగా దెబ్బకొట్టడానికి భారత్ చర్యలు వేగవంతం చేసింది. లష్కరే తోయిబా వంటి ఉగ్ర సంస్థలకు నిధులు సమకూరుస్తున్నందుకు తగిన శిక్ష పడేలా భారత్ ప్రయత్నిస్తోంది. తాజాగా ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్)లో కూడా పాక్‌ను తిరిగి 'గ్రే లిస్ట్'లోకి చేర్చేందుకు చర్యలు మొదలుపెట్టింది. ప్రస్తుతం ఐఎంఎఫ్ నిధుల కోసం పాక్ చేస్తున్న ప్రయత్నాలకు గండి కొట్టాలంటే ఎఫ్ఏటీఎఫ్ చర్యలే కీలకంగా మారాయి. ఈసారి ఎఫ్ఏటీఎఫ్ భేటీలో పాక్‌పై నిఘా పెంచాలన్న ప్రతిపాదన భారత్ తీసుకొచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి దీనిని గ్రేలిస్ట్‌గా పేర్కొంటారు. ఈ జాబితాలో కొన్నేళ్లపాటు ఉన్న తర్వాత పాక్ 2022లో బయటపడింది. నాడు మనీలాండరింగ్, టెర్రర్ ఫైనాన్స్‌ను అడ్డుకోవడానికి తీసుకొంటున్న చర్యలను చూపించి ఊరట పొందింది. భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి పాక్ టెర్రర్ ఫైనాన్సింగ్, మనీలాండరింగ్‌కు సహకరించిందన్న ఆధారాలు భారత్ వద్ద ఉన్నట్లు ఎఫ్ఏటీఎఫ్‌లో గతంలో పాల్గొన్న ఓ అధికారి తెలిపారు. వాటిని ప్రపంచ వేదికపై అవసరమైనప్పుడు బయటపెట్టాలన్నారు. ఎఫ్ఏటీఎఫ్‌లో భారత్ సభ్యదేశం. పాకిస్థాన్ మాత్రం ఆసియా పసిఫిక్ గ్రూప్ ఆఫ్ మనీలాండరింగ్‌లో ఓ భాగం. రానున్న రోజుల్లో పాక్‌కు ఆర్థిక ప్యాకేజీపై ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి) బోర్డు సమావేశంలో కూడా భారత్ ఈ అంశాన్ని లేవనెత్తనుంది. పహల్గాం దాడి నేపథ్యంలో పాక్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడాన్ని భారత్ వ్యతిరేకించనుంది. 'ఐఎంఎఫ్ బోర్డు, ఎఫ్ఏటీఎఫ్ ఎదుట పెట్టేందుకు ఇప్పటికే ఆధారాలు సేకరించాం. ఉగ్రవాదానికి మద్దతు, ఆశ్రయం ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు వెళ్లకూడదన్న అంశంపై భారత్ గట్టిగా నిలబడనుంది' అని ఓ అధికారి వెల్లడించారు.

పాత బంకర్ల పునరుద్ధరణ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. పాక్ ఉగ్రవాదులను వెంటాడి వేటాడుతామంటూ భారత్ హెచ్చరికలు జారీ చేయడంతో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి దశాబ్దాల నాటి పాత బంకర్లను పునరుద్ధరించే పనులను సైన్యం చేపట్టింది. కంచుకోట లాంటి ఈ బంకర్లను 1965, 1971 యుద్ధ సమయాల్లో ఆర్మీ వినియోగంలోకి తెచ్చింది. తాజాగా మరోసారి వాటిని పునరుద్ధరిస్తూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దుల వద్ద బలగాలు మరింత అప్రమత్తత పాటిస్తున్నాయి. అత్యవసర పరిస్థితి వస్తే సరిహద్దులకు సమీపంలోని జనావాసాలను ఖాళీ చేయించి... వారిని కొత్తగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ బంకర్లకు తరలించనున్నారు. సున్నిత ప్రాంతాలైన యూరి నుంచి నౌషెరా సెక్టార్ వరకూ ప్రజలను ఆ బంకర్లకు తరలిస్తారు. ఎల్ఓసీ, అంతర్జాతీయ సరహద్దులకు సమీపంలోని ఈ బంకర్లలో నీటి సరఫరా, కనీస అవసరాలను అందుబాటులో ఉంచనున్నారు. యుద్ధం అంటూ మొదలైతే ఆ ప్రభావం మొదటగా ఎల్ఓసీ వెంబడి ప్రజలపై పడే అవకాశం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యలను సైన్యం చేపడుతోంది.

ఘోర ప్రమాదం... 8 మంది మృతి

కటిహార్ (బీహార్): బీహార్‌లోని కటిహార్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. కటిహార్ ఎస్పీ వివరాల మేరకు కారు, ట్రాక్టర్ ఢీకొని 8 మంది మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బాధితులంతా సుపౌల్‌కు చెందినవారని, వివాహ వేడుకకు హాజరై తిరిగి సొంతూరుకు వస్తుండగా ప్రమాదం జరిగిందని కటిహార్ ఎస్పీ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

నితీశ్ ఇంటి వద్ద ఉద్రిక్తత

- ఉపాధ్యాయ నియామక పరీక్ష అభ్యర్థుల నిరసన
- పోలీసుల లాఠీఛార్జ్... అనేక మందికి గాయాలు

పాట్నా: పాట్నాలోని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధికారిక నివాసం దగ్గర మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉపాధ్యాయ నియామక పరీక్ష సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టిన అభ్యర్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష (టీఆర్ఈ-3) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనకారులు 1 అన్నే మార్గ్‌లోని సీఎం నివాసం గేట్ల వెలుపల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రాంతం మొత్తం హై-సెక్యూరిటీ జోన్, అలాంటి నిరసనలకు అనుమతి లేదు. ప్లకార్డులు పట్టుకుని పెద్ద సంఖ్యలో నిరసనకారులు రాష్ట్ర ప్రభుత్వానికి, పరీక్ష నిర్వహించిన బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సచివాలయ-1 సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డీపీవో) అను కుమారి... నిరసనకారులు వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని అభ్యర్థించారు. నిరసనకారులు వెనక్కి తగ్గడానికి నిరాకరించడంతో పోలీసులు అభ్యర్థులను చెదరగొట్టడానికి లాఠీఛార్జ్ చేశారు. అయితే ఎస్‌డీపీవో విలేకరులతో మాట్లాడటానికి నిరాకరించారు. లాఠీఛార్జ్‌లో అనేక మంది గాయపడ్డారని నిరసనకారులు పేర్కొనగా, దానిని అధికారులు తిరస్కరించారు. నాలుగు నెలలుగా గార్దానీబాగ్ ప్రాంతంలో తాము నిరసన తెలుపుతున్నామని నిరసన తెలుపుతున్న అభ్యర్థులలో ఒకరైన కృతి దత్తా చెప్పారు. 'మేము మంత్రుల నుంచి కార్యదర్శులు, ఎమ్మెల్యేల వరకు అందరినీ సంప్రదించాం. కానీ ఎవరూ మాకు ఎటువంటి పరిష్కారం చూపలేదు' అని ఆమె చెప్పారు.

ఈ సమస్యకు సంబంధించి బీపీఎస్సీకి లేఖ పంపామని విద్యా మంత్రి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఏమీ జరగలేదని మరొక అభ్యర్థి చెప్పారు. కాగా, పాట్నా జిల్లా మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ సింగ్, పోలీసు సీనియర్ సూపరింటెండెంట్ (ఎస్ఎస్పీ) అవకాష్ కుమార్ ఈ సంఘటనపై, నిరసనకారులు హై-సెక్యూరిటీ జోన్‌లోకి ఎలా ప్రవేశించగలిగారు అనే దానిపై మాట్లాడేందుకు అందుబాటులో లేరు. బీపీఎస్సీ మార్చి 2024లో ఉపాధ్యాయ నియామక పరీక్షను నిర్వహించింది. టీఆర్ఈ-3 కింద మొత్తం 87,774 పోస్టులను ప్రకటించారు. అయితే ఇప్పటివరకు దాదాపు 51,000 మంది అభ్యర్థులకు మాత్రమే నియామక లేఖలు వచ్చాయి. అధికారులు ముందుగా అనుబంధ ఫలితాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు అటువంటిది ఏమీ జరగలేదు.

రోడ్డు ప్రమాద బాధితులకు చేయూత

- రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఏడు రోజులకే పరిమితం
- కేంద్రం నోటిఫికేషన్

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్స అందించే పథకాన్ని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ ఒక అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పథకం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గత జనవరిలో వెలువరించిన తీర్పు ఈ నిర్ణయానికి మూలంగా నిలిచింది. రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్' (ప్రమాదం జరిగిన మొదటి గంట)లో ఉచిత వైద్యం అందించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం-2025' పేరుతో ఈ పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద, మోటారు వాహనం వల్ల ఏ రహదారిపై ప్రమాదం జరిగినా బాధితులు ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు పొందేందుకు అర్హులవుతారు. ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల పాటు ఈ ఉచిత చికిత్సను పొందవచ్చు. ట్రామా, పాలీట్రామా వంటి అత్యవసర సేవలు అందించగల సామర్థ్యం ఉన్న అన్ని ఆసుపత్రులను ఈ పథకం పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాలని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఒకవేళ సంబంధిత ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు లేకపోతే, తక్షణమే మరో ఆసుపత్రికి తరలించాల్సి ఉంటుంది.

ఇందుకోసం రవాణా సౌకర్యాలను కూడా ఆ ఆసుపత్రి కల్పించాలని పేర్కొంది. బాధితుడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత, అందించిన వైద్య సేవలకు సంబంధించిన బిల్లును నిర్దేశిత ప్యాకేజీకి అనుగుణంగా ఆసుపత్రి యాజమాన్యం ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఈ పథకం అమలుతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన అనేక మందికి సకాలంలో వైద్యం అంది, ప్రాణాలు నిలబడతాయని ఆశిస్తున్నారు.

భారత్‌లోకి మరో పాకిస్థానీ

అదుపులోకి తీసుకున్న సైన్యం

శ్రీనగర్: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో భారత సరిహద్దుల్లో పాకిస్థాన్ పౌరులు పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం జమ్ముకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఒక పాకిస్థానీని ఆర్మీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. సోమవారం కూడా పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ సరిహద్దుల్లోకి అక్రమంగా చొరబడ్డ ఒక పాకిస్థాన్ జాతీయుడిని బీఎస్ఎఫ్ జవాన్‌లు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఆ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండగానే తాజాగా మరో పాకిస్థానీ భారత్‌లో చొరబడ్డాడు. ఇదిలాఉండగా, ఏప్రిల్ 23న ఒక బీఎస్ఎఫ్ జవాన్‌ను పాకిస్థాన్ రేంజర్స్ అదుపులోకి తీసుకున్నారు. సరిహద్దుల్లో వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలకు రక్షణగా వెళ్లిన జవాన్ పొరపాటున ఫెన్సింగ్ దాటి వెళ్లడంతో పాక్ రేంజర్‌లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విడిపించేందుకు సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జవాన్‌లు సరిహద్దుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సైనిక ఉన్నతాధికారులు సూచించారు. పొరపాటున కూడా అవతలివైపు అడుగు పెట్టవద్దని చెప్పారు.

వివాదంలో యూనియన్ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ వివాదంలో చిక్కుకుంది. భారత ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన కృష్ణమూర్తి వి.సుబ్రమణియన్ రచించిన పుస్తకానికి సంబంధించి దాదాపు 2 లక్షల కాపీలను రూ.7.25 కోట్లకు కొనుగోలు చేసిందని ప్రముఖ ఆంగ్లపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవి నుంచి ఇటీవల భారత ప్రభుత్వం కేవీ సుబ్రమణియన్‌ను తప్పించిన వేళ ఈ వ్యవహారం వెలుగు చూసింది. భారత ప్రభుత్వానికి సీఈఏగా వ్యవహరించిన సుబ్రమణియన్ గతేడాది 'ఇండియా ఏ100' పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని కస్టమర్లకు, కార్పొరేట్లకు, స్కూళ్లకు, కాలేజీలకు, లైబ్రరీలకు పంపిణీ చేయాలని యూనియన్ బ్యాంక్ సెంట్రల్ ఆఫీసు నిర్ణయించింది. ఇందులో భాగంగా 1,89,450 పేపర్ బ్యాక్‌లను రూ.350 చొప్పున, 10,422 హార్డ్‌కవర్ కాపీలను రూ.597 చొప్పున కొనుగోలు చేసేందుకు ఆర్డర్ చేసింది. ఇందుకోసం రూ.7 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. వాస్తవానికి 2024 ఆగస్టులో ఈ పుస్తకం విడుదల కాగా... విడుదలకు ముందే ఈ పుస్తకాన్ని ప్రచురించిన రూపా పబ్లికేషన్స్‌కు యూనియన్ బ్యాంక్ 50 శాతం చెల్లింపులు చేసినట్లు ఆ పత్రిక పేర్కొంది. సాధారణంగా ఓ ఇంగ్లిష్ కాపీ పుస్తకం 10 వేల కాపీలు దాటడం అరుదు. అలాంటిది 2 లక్షల కాపీలకు యూనియన్ బ్యాంక్ ఆర్డర్ పెట్టడం ప్రశ్నలు రేకెత్తిస్తోంది. బ్యాంక్‌కు చెందిన 18 జోనల్ కార్యాలయాల నుంచి పదేసి వేల కాపీల చొప్పున ఈ ఆర్డర్ రావడం అనుమానాలను పెంచుతోంది. 2018 నుంచి 2021 వరకు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన సుబ్రమణియన్‌ను 2022లో ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్‌గా భారత్ నియమించింది. మూడేళ్ల పదవీ కాలానికిగానూ ఇంకా ఆరు నెలలు మిగిలి ఉండగానే ఈ ఏడాది 30న రీకాల్ చేసింది. తొలుత అనేక కారణాలు వినిపించినప్పటికీ... బహుశా ఈ పుస్తకాన్ని ప్రమోట్ చేయడంలో అవకతవకలు ఉండొచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి. మరోవైపు సుబ్రమణియన్ తొలగింపుపై ఐఎంఎఫ్ స్పందించింది. అది పూర్తిగా భారత ప్రభుత్వ నిర్ణయమని పేర్కొంది.

పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం

చండీగఢ్: పహల్గాం దాడి తర్వాత దేశంలో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం ఉందని భారత నిఘా వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో భద్రతా బలగాలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. పంజాబ్‌లోని అటవీ ప్రాంతం సమీపంలో ఉగ్ర కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడుల్లో భారీగా గ్రెనేడ్‌లు, ఐఈడీలు సహా ఉగ్రవాద వైర్‌లెస్ కమ్యూనికేషన్ హార్డ్‌వేర్‌ను స్వాధీనం చేసుకొని ఉగ్రకుట్రను భగ్నం చేశారు. ఉగ్రదాడులకు పంజాబ్‌లోని స్లీపర్ సెల్స్‌ను పునరుద్ధరించడానికి పాకిస్థాన్ నిఘా సంస్థతో అనుబంధం ఉన్న ఉగ్రవాద సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గుర్తించామని డీజీపీ తెలిపారు. మరోవైపు.. కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో ముష్కరులకు సాయం చేస్తున్న ఇద్దరు సహాయకులను భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా బలగాలు ధ్వంసం చేసి... పెద్దఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

ఇది ప్రమాదకర సంస్కృతి

పోలీసులకు బాంబే హైకోర్టు చీవాట్లు



ముంబై: పోలీసులపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చార్జిషీట్లలో సాక్షి వాంగ్మూలం కాపీ, పేస్టింగ్ చేయడం సరికాదని మండిపడింది. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులలో సైతం పోలీసులు సాక్షుల వాంగ్మూలాలను కాపీ పేస్టింగ్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేసింది. ఈ పద్ధతి 'ప్రమాదకర సంస్కృతి' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. నిందితులకు మేలు చేసేందుకు తోడ్పడే ఈ సంస్కృతికి ముగింపు పలకాలని హెచ్చరించింది. బాంబే హైకోర్టుకు సంబంధించిన ఔరంగాబాద్ ధర్మాసనం ఓ క్రిమినల్ కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. చార్జిషీట్‌లలోని సాక్షి వాంగ్మూలం పేరాగ్రాఫ్‌లు, మొదటి వర్డ్, చివరి వర్డ్ మక్కీకి మక్కీగా ఉండటాన్ని హైకోర్టు గుర్తించింది. అత్యంత త్వరగా సాక్షి వాంగ్మూలం కాపీ పేస్టింగ్ సంస్కృతిని విడనాడాలని, అందుకు సంబంధించి మహారాష్ట్ర సర్కారు మార్గదర్శకాలు విడుదల చేయాలని జస్టిస్ విభ కన్‌కన్‌వాడి, జస్టిస్ సంజయ్ దేశ్‌ముఖ్ ధర్మాసనం ఆదేశించింది.

గుజరాత్‌లో వర్షబీభత్సం

అహ్మదాబాద్: గుజరాత్‌ను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడి కుండపోత వర్షం కురిసింది. అనేకచోట్ల పిడుగులు పడ్డాయి. వర్షం కారణంగా సంభవించిన వేర్వేరు ప్రమాదాల్లో పది మందికిపైగా మరణించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 168 తాలుకాల్లో అకాల వర్షాలు కురిశాయి. కొన్ని తాలూకాలు, గ్రామీణ ప్రాంతాల్లో బలమైన గాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. ఈ వర్షం కారణంగా సంభవించిన వేర్వేరు ప్రమాదాల్లో 14 మంది మరణించారు.

2026లోనూ మా ప్రభుత్వమే

అవకాశవాద కూటమి లెక్కలు తప్పుతాయి: సీఎం స్టాలిన్

చెన్నై: 2026 ఎన్నికల తర్వాత తమ పార్టీ మరోసారి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, 'అవకాశవాద కూటమి' ఏర్పాటు చేసుకున్న వారి లెక్కలు ప్రజలచేత తప్పు అని నిరూపితమవుతాయని తమిళనాడు ముఖ్యమంత్రి, అధికార డీఎంకే అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ మంగళవారం విశ్వాసం వ్యక్తం చేశారు. మే 7న డీఎంకే ప్రభుత్వం ఐదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలకు రాసిన లేఖలో, వచ్చే ఏడాది డీఎంకే విజయం కోసం చురుకుగా పనిచేయాలని స్టాలిన్ పార్టీ కార్యకర్తలను కోరారు. సంక్షేమ ప్రభుత్వంతో గుర్తించబడిన పార్టీ నాలుగు సంవత్సరాల పనితీరు డీఎంకే విజయాన్ని నిర్ధారిస్తుందని ఆయన అన్నారు. 'అవకాశవాద కూటమిని ఏర్పాటు చేసుకుని, తమిళనాడును అనేక సార్లు మోసం చేసిన వారు, వారి వివేకవంతమైన మిత్రులు డీఎంకే ఓటమిని చూడాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రజలు తమ లెక్కలతో వాటిని తప్పని నిరూపిస్తారు' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలను చేరుకోవాలని, అనేక బహిరంగ సభల ద్వారా డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రత్యేకంగా వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. 2021 ఎన్నికలకు ముందు ఇచ్చిన 505 వాగ్దానాలలో చాలా వరకు అమలు అయ్యాయని, మిగిలినవి కూడా త్వరలో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆ విషయంలో తమ ప్రభుత్వం దృఢంగా ఉన్నట్లు స్టాలిన్ తెలిపారు. అలాగే పార్టీ కార్యకర్తలను ఆధునిక కమ్యూనికేషన్ సాధనాలను స్వీకరించమని కోరుతూ, వీడియోలు, 'రీల్స్' ప్రభావవంతమైన పద్ధతులుగా నిరూపితమయ్యాయని సీఎం అన్నారు. 'గంటసేపు ప్రసంగాలు చేయడం కంటే, అర నిమిషం వీడియోలు, రీల్స్ లక్షలాది మందికి త్వరగా చేరతాయి' అని చెప్పారు. అటువంటి సంబంధిత సమాచారాన్ని సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. డీఎంకే 'ఆత్మగౌరవ ఉద్యమం' అయినందున వివిధ సంస్థలను ఉపయోగించి చేసే రాజకీయ బెదిరింపులు, రాజకీయ ప్రతీకార చర్యలకు భయపడదని స్పష్టం చేశారు. 'ఇది తమిళనాడు హక్కులను తిరిగి పొందే ఉద్యమం, భారతదేశానికి మార్గం చూపుతుంది' అని డీఎంకే అధ్యక్షుడు పేర్కొన్నారు.

గొగోయ్ భార్యకు పాక్ సైన్యంతో బంధం

అసోం సీఎం హిమంత

గువహటి: అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ మరో సారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ భార్య ఎలిజబెత్ కోల్‌బర్న్‌కు పాకిస్థాన్ సైన్యంతో సత్సంబంధాలు ఉన్నట్లు ఆరోపించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌కు భారత్ నుంచి కోల్‌బర్న్ 19 సార్లు ప్రయాణం చేసినట్లు పేర్కొన్నారు. పాక్‌లో సంచరిస్తున్న సమయంలో ఆ దేశ సైన్యం ఆమెకు సహకరించారని, పాకిస్థాన్‌లో కోల్‌బర్న్ పని చేశారని, ఆ తర్వాత ఆమె ఢిల్లీలోని ఎన్జీవోలో చేసినట్లు చెప్పారు. కానీ పాకిస్థాన్ నుంచి ఆమె రెగ్యులర్‌గా వేతనం తీసుకున్నట్లు తెలిపారు. ఎంపీ గౌరవ్ గగోయ్ కూడా పాకిస్థాన్‌కు వెళ్లినట్లు బిశ్వశర్మ తెలిపారు. వారం రోజుల్లో ఆయన భార్య ఇండియాకు తిరిగి వచ్చిందని, కానీ గగోయ్ మాత్రం అక్కడే మరో ఏడు రోజులు ఉన్నట్లు చెప్పారు. పాకిస్తాన్‌లో 15 రోజుల పాటు గగోయ్ ఏం చేశారో చెప్పాలని అసోం సీఎం ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో అతనేం చేశారో చెప్పాలని, వాళ సైన్యానికి ఎలా సహకరించారో వెల్లడించాలన్నారు. ఒకవేళ అధికార హోదాలో గొగోయ్ పాకిస్థాన్‌కు వెళితే ప్రశ్నించే వాళ్లం కాదు అని, కానీ ఆయన తన వ్యక్తిగత పని మీద వెళ్లారని, అక్కడ పాక్‌లో ఎవరితో ఆయన ఉన్నారో తెలియాలని బిశ్వ శర్మ చెప్పారు.

మానవాభివృద్ధి సూచీలో

130వ స్థానంలో భారత్

న్యూఢిల్లీ: ప్రపంచ 'మానవాభివృద్ధి సూచీ' (హెచ్ఐడీ) లో భారత్ పురోగతి సాధించింది. 2023 ఏడాదికి సంబంధించి మొత్తం 193 దేశాల్లో భారత్‌కు 130వ స్థానం దక్కింది. అంతకుముందు ఏడాది అంటే 2022తో పోల్చుకుంటే మూడు స్థానాలు మెరుగుపడింది. 2022 ఏడాదికి సంబంధించిన మానవాభివృద్ధి సూచీలో భారత్ 133వ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఏడాది మూడు స్థానాలు పురోగతి చెందింది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) కి సంబంధించిన మానవాభివృద్ధి సూచీ-2025 నివేదిక మంగళవారం విడుదలయింది. ఈ నివేదికలో 2023 ఏడాదికి సంబంధించిన సమాచారం పంచుకుంది. అదే విధంగా లింగ అసమానత సూచీలో కూడా భారత్ వృద్ధిని నమోదు చేసింది. 2023లో మొత్తం 193 దేశాల్లో భారత్ 102వ స్థానంలో నిలిచింది. అంతకుముందు ఏడాది అంటే 2022లో 166 దేశాల్లో భారత్ 108వ స్థానం దక్కించుకుంది. అంటే ఈ ఏడాది ఆరు స్థానాలు మెరుగుపడింది. హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్-2025 ప్రకారం భారతీయుల జీవిత కాలం కూడా మెరుగుపడింది. 2023లో భారత పౌరుడి సగటు జీవితకాలం 72 ఏళ్లుగా నమోదయింది. అంతకుముందు ఏడాది అంటే 2022లో భారత పౌరుడి సగటు జీవితకాలం 71.7 ఏళ్లుగా ఉంది. ఇప్పటికే వరకు ఇచ్చిన నివేదికల్లో ఇదే అత్యధిక సగటు జీవితకాలమని యూఎన్‌డీపీ తెలిపింది. 1990లో భారత పౌరుడి సగటు జీవితకాలం అతితక్కువగా 58.6 ఏళ్లు ఉందని వెల్లడించింది.

కళ్లుచెదిరేలా కట్న కానుకలు

జైపూర్: తన కుమార్తెపై ప్రేమతో పుట్టింటి వారు పెళ్లి వేళ కళ్లు చెదిరే కట్నకానుకలు సమర్పించుకున్నారు. అత్తారింట తమ బిడ్డ ఏమాత్రం కష్టపడకూడదన్న ఉద్దేశంతో భారీగా కానుకలు ఇచ్చారు. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాల్లో జరిగిన ఈ వివాహ వేడుక నెట్టింట్లో వైరల్‌గా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం రాజస్థాన్‌లో ఒక వర్గం సంప్రదాయం ప్రకారం పెళ్లికి ముందు జరిగే ఒక వేడుకలో పుట్టింటి వారు ఆడపిల్లలకు అనేక రకాల బహుమతులు ఇస్తుంటారు. నాగౌర్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం కేజీ బంగారం, 15 కేజీల వెండి, 130 ఎకరాల భూమి, పెట్రోల్ బంక్, అజ్మీర్‌లో స్థలం, రూ.1.51 కోట్ల నగదు, వాహనాలు, వస్త్రాలు వంటి వాటిని తమ కుమార్తెకు అందజేసింది. మైక్‌లో బంధువులు ఇచ్చిన కానుకలన్నీ చదివి వినిపించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. సుమారు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వాటి విలువ ఉండొచ్చని తెలుస్తోంది. ఆ వివాహానికి పెద్ద ఊరేగింపులా వచ్చిన వధువు బంధువులు... నాలుగు సూట్‌కేసుల్లో బహుమతులు తీసుకువచ్చారు. 100 కార్లు, నాలుగు లగ్జరీ బస్సుల్లో వచ్చి బహుమతులు అందజేశారు. ఇదంతా రాజకుటుంబ పరేడ్‌లా అనిపించిందని స్థానికులు వెల్లడించారు. వివాహానికి వచ్చిన వారికి వెండి నాణేలు పంచారు. ఈ దృశ్యాలు వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. వరుడు కుటుంబం అంత ఖరీదైన బహుమతులు స్వీకరించడం పట్ల విమర్శలు చేశారు. తమ సంపదను ఇలా ప్రదర్శించడం వల్ల ఇతరులపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సహాయక చర్యలు ముమ్మరం చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టినట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నగరంలో వాతావరణ శాఖ సూచన మేరకు గ్రేటర్‌లో తేలికపాటి వర్షం నమోదు కావడంతో రోడ్లపై నీరు నిలిచే 141 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి క్లియర్ చేయించడం జరిగిందన్నారు. తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి వ్యాప్తంగా 155 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లను ఏర్పాటు చేసింది, వాటి ఆధారంగా జిహెచ్ఎంసిలో సగటు వర్షపాతం 2.3 మీ మీ.నమోదు అయ్యింది. ప్రధానంగా సికింద్రాబాద్ జోన్ ముషీరాబాద్ సర్కిల్ జవహర్ నగర్ ఆర్.టి.సి క్రాస్ రోడ్డు, ముషీరాబాద్ సర్కిల్ నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జి, ఎల్.బి.నగర్ జోన్ ఉప్పల్ సర్కిల్ వరంగల్ హైవే రోడ్డు ఆదిత్య హాస్పిటల్, స్టేడియం వద్ద, చార్మినార్ జోన్ రాజేంద్రనగర్ సర్కిల్ పిల్లర్ నెంబర్ 191 వద్ద ఈ ప్రాంతాల్లో నిలిచిన వరద నీరు వాహనదారులకు ట్రాఫిక్ జామ్ జరగకుండా వెనువెంటనే క్లియర్ చేశారాని కమిషనర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం జరగలేదన్నారు. గోడ ఇల్లు కూలిన సంఘటనలు, మానవ ప్రమాదాలు సంభవించలేదని కమిషనర్ ఆర్.వి కర్ణన్ వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర, కాప్రా : నాచారం డివిజన్ స్నేహపురి కాలనీ పార్కులో రూ.13 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ,రూ. 50 లక్షల వ్యయంతో నాచారం అన్నపూర్ణ కాలనీలోని బేడ బుడగ జంగాల స్మశాన వాటిక అభివృద్ధి పనులకు , ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ అసిస్టెంట్ ఇంజనీర్లు కీర్తి , వినీత్ మరియు భారత నాయకులు కార్యకర్తలు అలాగే స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మరియు నాచారం డివిజన్ బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం పెద్దలు పాల్గొన్నారు

కొలను హన్మంత్‌రెడ్డి జన్మదినోత్సవం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గం 130 డివిజన్ సుభాష్ నగర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్ పటేల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరణ్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాన్ మానసిక వికలాంగుల గృహం లో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్స్ పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.అనంతరం సుభాష్ నగర్ డివిజన్ నుండి భారీ ఎత్తున తరలి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలను హన్మంత్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు భాస్కర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, నగేష్ రెడ్డి, రాజు చారి, గురువా రెడ్డి, సత్తి రెడ్డి, యాసిన్, యూసఫ్, రమ్య, ప్రసన్న, అర్చన, అఫ్సార్, యూత్ నాయకులు హరి, శ్యామ్, వాసు, నాగేందర్, అశ్రఫ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల సంక్షేమానికి కృషి:యాదిలాల్

విశాలాంధ్ర - ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అండే కార్ యాదిలాల్‌కు మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు యాదిలాల్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. న్యాయవాదుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కల్వకుర్తి, ఆమనగల్లు కోర్టుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని యాది లాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు జమీల్ అహ్మద్, కృష్ణయ్య, మల్లేష్ యాదవ్, మల్లేష్, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, జంగయ్య, రాంపాల్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, శ్రీకాంత్, రమణ, నాగరాజు, నరేష్ , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

విశాలాంధ్ర, హైదరాబాద్ : శ్రీ రంగాపూర్‌లో దాతల సహకారంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించడం జరిగింది. డిజిటల్ కార్డు తో నడిచే ఈ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసినందుకు కలెక్టర్ నారాయణ రెడ్డి దాతలను అభినందించారు. రక్షిత మంచినీటి పథకం దాతలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, కొందుర్గు మండలం మాజీ సింగల్ విండో డైరెక్టర్ బిమిడి అశోక్ రెడ్డి, షాద్ నగర్ ఆర్‌డిఓ సరిత, తహసీల్దార్ రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి

ప్రభుత్వం ప్రాధాన్యత : మంత్రి పొన్నం

ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నాయకులకు మంత్రి ధన్యవాదాలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఆర్టీసీ శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని సమ్మె వాయిదా వేసుకోవాలన్న విజ్ఞప్తికి స్పందించి సమ్మె వాయిదా వేసిన ఆర్టీసీ కార్మికులకు జేఏసి నాయకులకు మంత్రి పొన్నం ప్రభాకం ధన్యవాదాలు తెలియజేశారు. సచివాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం నేతృత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ జేఏసీ, కార్మిక సంఘాల నేతలు కలిశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ జేఏసి కార్మిక సంఘాల నేతలు తీసుకువచ్చారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కార్మికుల సంక్షేమం ప్రయాణికుల సౌకర్యాలకు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. సమ్మె వాయిదా వేసుకోవాలని ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికులు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారని, ఆర్టీసీ కార్మికులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. సమస్యల పరిష్కారానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాంలతో కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడతామన్నారు. ఆర్టీసీ సమస్యలపై ముఖ్యమంత్రితో మాట్లాడి కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్టీసీ జేఏసి కార్మిక సంఘాలు తక్షణమే సమ్మెపై వెనక్కి తగ్గాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్టీసీ సమస్యలపై ఇప్పటికే టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వర్థామ రెడ్డి , ఐఎన్‌టియుసి రాజిరెడ్డి, ఎన్ఎంయు జనరల్ సెక్రటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి, ఎస్‌టిఎంయు జనరల్ సెక్రెటరీ పున్న హరి కృష్ణ తదితర సంఘాలు సమావేశమైనప్పుడు సమ్మెపై వెనక్కి తగ్గాలని విజ్ఞప్తి చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, షాట్ చైర్మన్ శివసేన రెడ్డి తదితర ఎమ్మెల్యేలు ఆర్టీసీ కార్మికులు సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి చొరవ తీసుకున్నారన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ కార్మికులు మా కుటుంబంలా భావిస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీకి వ్యతిరేకంగా ఏ ఒక్క నిర్ణయంతీసుకోలేదని, గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేస్తే, మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి ఆర్టీసీని ఇప్పుడిప్పుడే లాభాల బాటలో నిలబెడుతున్నామన్నారు. గత 10 సంవత్సరాలుగా ఆర్టీసీని నిర్వీర్యం చేశారని, ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగం నియామకం చేయలేద, సిపిఎస్, పిఎఫ్ పైసలు వాడుకున్నారని, టిజిఎస్ఆర్‌టిసి ఉద్యోగులకు 2013 నుండి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించిందని, 2017 పే స్కేల్ 21% శాతం ఇచ్చింది సంవత్సరానికి 412 కోట్లు భారం పడుతుందన్నారు. పిఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘ కాలంగ పెండింగ్‌లో ఉన్న 1039 కోట్లు చెల్లించామన్నారు. నెలవారీ పిఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుందని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సిసిఎస్ బకాయిలు ఉద్యోగులకు 345 కోట్లు రూపాయలు చెల్లించామని, నెలవారీ సిసిఎస్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుందని, 1500 మంది కారుణ్య నియామకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం టిజిఎస్ఆర్‌టిసిలో 3038 మంది ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేయడానికి అనుమతి ఇచ్చిందన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో వర్షాలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇవాళ, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించారు. 'వేసవి కాలంలో వర్షాలు తరచూ వస్తూ ఉంటాయి. తేమ గాలులు భూ భాగాన్ని తాకినప్పుడు పగలు ఎండ, సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయి. గత వారం రోజులుగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఈరోజు పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని శ్రీనివాస్ రావు, వాతావరణ శాఖ అధికారి తెలిపారు. నిన్న కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో సైతం వచ్చిన పెద్ద వాన నగరవాసులను ఇబ్బందులు పెట్టింది. ఏకంగా ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్, దిల్లీ మధ్య జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంఘం విడుదల చేసిన నివేదిక ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా వర్షం కురిసిన టాప్ 3 ప్రాంతాలను వరుసగా చూస్తే, కరీంనగర్‌లో 39.0 మిల్లీమీటర్లు, సిద్దిపేటలో 30.03 మిల్లీమీటర్లు, హైదరాబాద్‌లో 28.0 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు.

భూ సమస్యల సత్వర పరిష్కారానికి భూభారతి: కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. భూ భారతీ పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం కొందుర్గు మండలం ఉతరస్పల్లి, గ్రామంలో నిర్వహించిన సదస్సులో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించి, రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. సదస్సులో భేటీ అయ్యి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా భూభారతి విధివిధానాల గురించి, చట్టంలో పొందుపర్చిన అంశాలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులతో కూడిన బృందాలు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన మీదట నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన కొందుర్గు మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు ముగిశాక, జిల్లాలోని మిగితా మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో షాద్ నగర్ ఆర్డీఓ సరిత, సంబంధిత తహశీల్దార్లు, ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసూతి సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఇతర చికిత్సలపై ఆస్పత్రిలోకి వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసుపత్రుల పనితీరు, సాధారణ ప్రసవాలు, నీటి కొరతలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డాక్టర్ రాజేంద్రనాథ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అఫ్ హెల్త్ సర్వీసెస్ (డిసిహెచ్ఎస్) తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. హైదరాబాద్ జిల్లాలోని జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల సూపరింటెండెంట్లు, మెడికల్ ఆఫీసర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలతోపాటు, ప్రసూతి సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే ఇతర చికిత్సలకై ఆసుపత్రులకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందాలని ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గత నెలలో 967 ప్రసవాలు జరిగాయని, అందులో 40 శాతం సి-సెక్షన్‌లుగా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రసవాల సంఖ్యను పెంచాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా సి-సెక్షన్ డెలివెరీలను తగ్గించినందుకు కింగ్ కోటి ఆసుపత్రిని,బార్కాస్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులను అభినందించారు. నీటి సంరక్షణ యొక్క ఆవశ్యకత గురించి మాట్లాడుతూ ఆసుపత్రులలో వేసవి దృష్ట్యా నీటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వర్షా కాలంను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రులలోని ఇంకుడు గుంతలు సరైన పరిస్థితిలో ఏర్పాటు చేసుకోవాలనిల్ల కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్య మిత్రకు సంబందించిన సమస్యలు తెలుపగా, ఆరోగ్య మిత్ర పనితీరు అలాగే సమస్యలను చర్చించడానికి త్వరలో ఒక సమావేశం నిర్వహించబడుతుంది పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రిలో సూపర్డెంట్లు, కమ్యూనిటీ సెంటర్స్ ఆస్పత్రుల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మే 20న జరుగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయవల్సిందిగా తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఏఐటీయూసీ) అధ్యక్షురాలు పి.ప్రేంపావనీ, కన్వీనర్లు నందూరి కరుణ కుమారి, సి. హెచ్.సీతామహాలక్ష్మీ, డి.కమలారెడ్డిలు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను 4 కోడ్‌లుగా రూపొందించి కార్మిక హక్కులను హరించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రను వ్యతిరేకిస్తూ తక్షణం 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశంలో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సంఘాలు, అసోసియేషన్లు మే 20న సమ్మెకు పిలుపునిచ్చాయి. గతంలో కార్మిక చట్టాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ 27సార్లు దేశవ్యాపిత సమ్మెలు చేయటం జరిగింది. కోట్లాది మంది కార్మికులు ఈ సమ్మెలలో పాల్గొన్నారు. కార్పొరేట్ల అనుకూల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, కస్తురా్ బాలికల విద్యాలయం, సర్వశిక్షాభియాన్, గ్రామీణ ఉపాధి హామీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది మహిళా కార్మికులు తక్కువ వేతనాలతో ఎక్కువ పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారు. తమ శ్రమను వెచ్చిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చే విధంగా పని చేస్తున్న వీరికి కనీసవేతనాలు, గ్రాట్యుటీ, సామాజిక భద్రతా చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం వీరి చట్ట భద్రతను హరించే విధంగా చేపట్టిన ఈ కార్మిక వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో శ్రామిక మహిళలంతా నిరసిస్తూ, 20న జరిగే సమ్మెలో వేలాదిగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని, ఇది ప్రభుత్వానికి ఒక హెచ్చరిక కావాలి.

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమే : ఎస్టీయూటీఎస్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రభుత్వంలో బాగామేనని, వారి సమస్యలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పర్వత్ రెడ్డి, సదానందం గౌడ్ గుర్తు చేశారు. మంగళవారం వారొక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై గతంలో అనేక మార్లు ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు సమర్పించినట్లు తెలియజేశారు. పాఠశాల విద్యలో కొంత మేరకు సమస్యలకు పరిష్కారం దక్కిన సంగతి హర్షదాయకం. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించడమేగాక, నూతన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన ప్రభుత్వం, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉచిత విద్యుత్ పంపిణీ వంటి చర్యలతో పాఠశాల విద్యాభివృద్ధికి చేసిన కృషికి ఉపాధ్యాయ లోకం కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. అయినప్పటికీ, అనేక ముఖ్యమైన ఆర్థిక, సంక్షేమ సంబంధిత సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. వాటి పరిష్కార నిమిత్తం జిల్లా కేంద్రాల్లో సదస్సులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో రాష్ట్ర స్థాయిలో ఈ నెల 4న "రాష్ట్ర స్థాయి ఉద్యోగ సదస్సు" విజయవంతంగా నిర్వహించామని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈకుబేర్ పెండింగ్ బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలని, పెండింగ్ డి.ఎ.లను విడుదల చేయాలని, ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పిఆర్‌సి నివేదికను పొందించి 51% ఫిట్మెంట్‌ను అమలు చేయాలని, ఉద్యోగ ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను సమర్థవంతంగా అమలు చేయాలనని కోరారు ప్రజా సంక్షేమ పథకాల అమలుకు మేము వ్యతిరేకులం కాదని, మేము వాటిలో భాగస్వాములమేనని గుర్తు చేశారు. అయితే ఉద్యోగ వర్గ హక్కుల పరిరక్షణ కోసం చట్టబద్ధంగా మాట్లాడే హక్కు తమకు ఉందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని, మంత్రివర్గాన్ని, ఉన్నతాధికారులను సమస్యల పరిష్కారానికి చర్చల ప్రక్రియ ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌టియుటిఎస్ తరఫున కోరుతున్నామన్నారు. మానవీయత, న్యాయ బద్ధతతో కూడిన నిర్ణయాలు తీసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో విశ్వాసం కలిగించాలని వారు కోరారు.

ముంపు సమస్యకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో గతంలో చినుకు పడితేనే కాలనీలు జలమయం అయ్యే పరిస్థితి ఉండేది. నేడు ప్రతి కాలనీల్లో బాక్స్ డ్రైన్‌లు నిర్మించడంతో ముంపు సమస్యకు పరిష్కారం చూపినట్లు అయ్యింది. ఇదే క్రమంలో సత్తి రెడ్డి నగర్‌లో ముంపు సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేటర్ ప్రేం కుమార్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడుతున్నారు. గత ఏడాది డిప్యూటి మేయర్ మోతే శ్రీలతా రెడ్డితో కలిసి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్, లాలాపేట్ హద్దుల మధ్య ఉన్న సమస్యను పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేయించారు. మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ సత్తి రెడ్డి నగర్ నుండి లాలాపేట డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ వాసుల ముంపు సమస్య శాశ్వత పరిష్కారం జరుగుతుందని కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ తెలిపారు. కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రాంతంలో తీవ్ర సమస్యగా గతంలో ఉండేదన్నారు. లాలాపేట కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి ఆరు నెలల క్రితం సంయుక్తంగా కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. సుమారు రూ.65 లక్షలు బాక్స్ డ్రైన్ నిర్మాణం కోసం మంజూరు చేశారన్నారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయని, వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేస్తామన్నారు. నిధులు మంజూరు చేసినటువంటి డిప్యూటీ మేయర్ మోతే సూపర్ రెడ్డికి డివిజన్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం అధికారులతో కలిసి బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ లక్ష్మణ్, డీ.ఈలు లౌక్య, సువర్ణ, ఏ.ఈ శ్రీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లో స్ప్రింగ్ వ్యాలీలో సుమారు రూ. 80 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులకు పిఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేకపూడి గాంధీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో దశల వారిగా సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీవాసులు సహకరించాలని కోరారు. కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, పద్మారావు, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, మల్లేష్, స్ప్రింగ్ వ్యాలీ ప్రెసిడెంట్ సాయి చౌదరి, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, జనరల్ సెక్రటరీ చైతన్య, ట్రెజరర్ నర్సింహా రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజేష్, అడ్వైసరీ వైభవ్, శ్రీనివాస్, లక్ష్మి ప్రసన్న, లక్ష్మి ప్రియా, రమణి, సమీర, స్ప్రింగ్ వ్యాలీ సొసైటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పొంగిపోర్లుతున్న మురుగు
పట్టించుకొని అధికారులు

విశాలాంధ్ర, కాప్రా : కాప్రా సర్కిల్ మల్లాపూర్ డంపింగ్ యార్డు నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో కాలనీల్లో దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. మురుగు నీరు ప్రవహించడంతో పరిసర ప్రాంతాల్లోని నాలుగు కాలనీల్లో మురుగునీటి కంపుతో గత పదిరోజులుగా పడరాని పాట్లు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇక్కడి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయాలని లేని పక్షంలో డంపింగ్ యార్డు వద్ద ఆందోళన చేయాల్సి వస్తోందని టీడీపీ సీనియర్ నాయకులు సూర్యం రాజేష్ హెచ్చరించారు. పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదన్నారు.

'రాజీవ్ యువ వికాసం'తో యువతకు స్వయం ఉపాధి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో కలిసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం ద్వారా లబ్దిచేకూరేలా దరఖాస్తులను పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మండలాల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయని వాటిలో పరిశీలించినవి ఎన్ని అని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో ఎలిజిబిలిటి ఉన్న దరఖాస్తులను బ్యాంకర్స్ లాగిన్‌లోకి పంపాలని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయని అవసరమైన సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులకు ఫోన్ చేసి తెప్పించుకొని బ్యాంకర్స్ లాగిన్‌కి పంపాలని, పూర్తి అర్హత లేని దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టాలని, ఏవి కూడా రిజెక్టు చేయకూడదని కలెక్టరు తెలిపారు. బ్యాంకర్స్ తప్పనిసరిగా సిబిల్ స్కోర్ వెరిఫై చేయాలని సూచించారు. అయితే ఇందులో మొదటి, రెండవ కేటగిరిలకు సిబిల్ స్కోర్ అవసరం లేదని, 3, 4 కేటగిరిలలోని ధరఖాస్తులకు మాత్రం తప్పకుండా సిబిల్ స్కోర్ పరిశీలించాలన్నారు. ఒక మున్సిపాలిటివి వేరొక మున్సిపాలిటిలోకి, అదే విధంగా ఒక వర్గానికి సంబంధించినవి వేరొక వర్గంలోకి దరఖాస్తు వచ్చి ఉంటే వాటిని వెంటనే సంబంధిత మున్సిపాలిటికి, సంబంధిత వర్గాలకు ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. ఎంపికైన దరఖాస్తుల సెలెక్షన్ లిస్టులను వెంటవెంటనే పంపాలని అధికారులకు సూచించారు. వచ్చినవి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మండలాల వారీగా కలెక్టరు పరిశీలించారు. దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని, ధరఖాస్తుల ఎంపిక ప్రక్రియలో పూర్తి బాధ్యత అధికారలదేనని కలెక్టరు స్పష్టం చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి వచ్చిన దరఖాస్తులను పంశీలించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పిసిఈఓ కాంతమ్మ, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, బిసి సంక్షేమ శాఖాధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్‌ఈడి బాబు మోసిస్, ఎల్డిఎం, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, హౌజింగ్‌ఈడిరమణ మూర్తి, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్థశాస్త్ర ఐఏఎస్ అకాడమీ ప్రారంభం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఉత్తమమైన సివిల్ సర్వీసెస్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం దిశగా నగరంలోని పాశం అమృత్‌రామ్ రెసిడెన్సీలో అర్థశాస్త్ర ఐఏఎస్ అకాడమీని స్థాపించినట్లు ప్రముఖ విద్యావేత్త, మార్గదర్శకుడు పెండ్యాల సతీష్‌కుమార్ బషీర్‌బాగ్‌లో మీడియాకు తెలిపారు. ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఐపీఎస్ అధికారి ఉమాపతి సత్తారు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, మాజీ ఐఏఎస్ అధికారి వి.ఎస్.విష్ణు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ బ్యాంకర్ రమేష్ గెల్లి, జీఎస్టీ అదనపు కమిషనర్ సాయి కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహా, గౌరా గ్రూప్ చైర్మన్ శ్రీనివాస్, ఏసీపీ, ఎస్‌ఓటీ డా.శ్రీనివాస్, ఏస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్ ట్యూషన్స్ గోపాలకృష్ణ మూర్తి, అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అవినాష్ బ్రహ్మదేవర, మడ్డి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ సుదర్శన్, ప్రసిద్ధ మోటివేషనల్ స్పీకర్, మెంటార్ అకెళ్ల రాఘవేంద్ర, 21వ శతాబ్దం ఐఏఎస్ అకాడమీ కృష్ణప్రదీప్ పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

విశాలాంధ్ర -మొయినాబాద్: భారతీయ జనతా పార్టీ మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల బీజేవైఎం మండల ప్రదాన కార్యదర్శిగా పనిచేశారు. చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ఆయన పార్టీకి చేసిన సేవాలను గుర్తించిన అదిష్టానం మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా నియమించింది. తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్షుడిగా భాధ్యతలు అప్పజెప్పినందుకు కృతనిశ్చయంతో పనిచేస్తానని ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

మతోన్మాదులను ప్రతిఘటించండి : మారుపాక

విశాలాంధ్ర, హైదరాబాద్ : మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదుల దౌర్జన్యాలలో యువతరం ప్రతిఘటించాలని పులి అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణ ఉద్యమాలు చేపట్టాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజ్ బౌదుర్గౌడ్ హాల్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం కే.ఏసు రత్నం అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ పూలే అంబేద్కర్‌లు తుది శ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించారని వారే మన ఆధునిక భారతావని నిర్మాతలని వారు చూపిన మార్గములో నేటితరం మనువాదంపై మహోద్యమమం చేపట్టాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కొలుస్తూ ఆయన అధ్యయన లోతులను విస్మరిస్తున్నారని చెప్పారు. భూమి జాతీయకరణ జరగాలని పరిశ్రమలలో కార్మికులకు యాజమాన్య వాటా హక్కు ఉండాలని నాడే ఆయన రాష్ట్రాలు మైనార్టీలు అనే పుస్తకంలో ప్రస్తావించారని చెప్పారు. మహిళా సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లు తీసుకొచ్చి నాటి ప్రభుత్వం అంగీకరించకపోతే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర బీజేపీ సర్కార్ విధానాల వల్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో పౌరులందరికీ హక్కులు కల్పించిన రాజ్యాంగమే కనుమరుగ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజస్వామ్య దేశాన్ని మతరాజ్యంగా మార్చే కుట్రలు చేస్తున్నారని, దీంతో అట్టడుగు వర్గాలకు ఈపాటి హక్కులు ఉండవన్నారు. భారత రాజ్యాంగం భారతదేశ ప్రజలందరికీ గుండెకాయ లాంటిదని దాన్ని రక్షించుకోవడం నేటితరం కర్తవ్యం కావాలన్నారు. ప్రైవేట్ రంగం 85 శాతానికి పెరిగిందని అందులో రిజర్వేషన్స్ లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధమన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం మహా ఉద్యమం జరగాలన్నారు.

సమావేశంలో తీర్మానం...

మే 20న జరిగే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుకు డిహెచ్‌పిఎస్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ కార్మిక పిలుపులో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఆపరేషన్ కాగాను తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది. జూన్ చివరి వారంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలు వరంగల్‌లో నిర్వహించాలని సమావేశాల్లో నిర్ణయించడం జరిగింది. మే 12న రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ రాజీవ్ యువ వికాస్ పథకంలో లోపాలపైన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పిలుపు. ఈ సమావేశంలో జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, పొన్నగంటి లావణ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, ఆఫీస్ బేరర్స్ కే.సహదేవ్, ఏ.రాజ్ కుమార్, జేరుపోతుల కుమార స్వామి, ఉషశ్రీ, సలిగంటి శ్రీనివాస్ శ్రీనివాస్, బి.లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు అంకితభావంతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి : లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరు అంకితభావం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని వక్తలు పేర్కొన్నారు. పేస్ ఐఐటీ, మెడికల్ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం జరి గింది. ముఖ్య అతిథిగా ఆ సంస్థ డైరెక్టర్ శంకర్ కస్తూరి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు హరిత కస్తూరి, చరిత దిట్టకవి తదితరులు పాల్గొన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ వంటి సబ్జెక్టుల లో బలమైన పునాటికి సహాయపడుతుందన్నారు. తమ సంస్థలో పనిచేసే బోధనా సిబ్బంది అనుబవజ్ఞులు అని, ఆన్లైన్ ద్వారా తరగతులు అందుబాటులో ఉంటాయన్నారు. కాగా తమకు రాష్ట్రవ్యాప్తంగా నిత్యా రెండవ, జె.వైష్ణవి మూడవ ర్యాంక్, ఏరోబా అహ్మద్ ఖురేషీ, ఎ. కుషాల్, ఎం. ఆదిత్య ప్రతీక్ మంచి ర్యాంకులు సాధించినట్లు వివరించారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర, కాప్రా : కార్మికుల సంక్షేమానికి జిల్లా కార్మిక శాఖ కృషి చేస్తుందని మేడ్చల్ జిల్లా కార్మిక శాఖ అధికారి సాయి సుమన్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లిలో దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నమన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటయ్య, మందుల మల్లేష్ లు కార్మిక శాఖ అధికారి సాయి సుమన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సత్తయ్య, అంజయ్య, మల్లేష్, కృష్ణ, తూర్పాటి స్వామి, యాకయ్య, సింహాచలంలు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి:నరసింహా

విశాలాంధ్ర - అమనగల్లు: యువత రాజకీయాల్లో రాణించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహా అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు హీరా సింగ్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో యువతకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షుడు జగన్, బిచ్య నాయక్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, దుడ్డు కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

I.A. No. 1120 / 2025 in S.A. No.185/2025

Between :
Yesepu Gantela, D.No.25-18-116, Parvathi Puram and another ...Appellants
And
1)The Authorized Officer, JM Financial Asset Reconstruction Company Limited, 7th Floor, Cnergy, Appasaheb Marathe Marg, Prabhadevi, Mumbai 400025. & 2 Others ....Respondents
To:
R-2:The Branch Manager, JM Financial Asset Reconstruction Company Limited, D.No. 7-1-616 & 617/A, Imperial Towers, 4th Floor, Ameerpet, Mian Road, Hyderabad 500016. Telangana.
R-3:Dewan Housing Finance Corporation Limited, Door No. 4-8-448, First Floor, Koritepadu Main Road, Koritepadu, Guntur, AP-522007.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION R2 & R 3

WHEREAS, I.A 1120/2025 IN S.A. No.185/2025 was listed before Hon'ble Presiding Officer/Registrar on 28/05/2025WHEREAS, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Securitization Application under section 17(1) of the Act (SA) with IA filed against you by challenging the actions taken by the respondent bank authorized officer against the property application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (1) of section 17 of the Act, you, the respondents/defendants are directed as under:-(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under the Securitisation Application.(ii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under the Securitization Application, pending hearing and disposal of the application for attachment of properties(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under the securitization application without the prior approval of the Tribunal.(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.You are also directed to file a written statement, Reply with a copy thereof furnished to the applicant and to appear before presiding Officer/Registrar on **28/05/2025 at 10:30 AM.** Failing the application shall be heard and decided in your absence.
REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM

కార్మికులకు అండగా ఉంటా : రవి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అన్యాయం జరిగిన కార్మికులకి అండగా ఉంటానని బీఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 'ఎస్ వి ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియా షాపూర్ నగర్' కంపెనీలో నరేష్ అనే కార్మికుడు కంపెనీలో గత కొన్ని సంవత్సరల నుంచి కంపెనీలో పని చేసేవాడు. కంపెనీ యజమాన్యం నరేష్ అనే కార్మికునికి కు గత మార్చి నెల మొత్తం అమౌంట్ అలాగే ఏప్రిల్ 15 రోజుల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో పని మానేశాడు. మార్చి నెల మొత్తం ఏప్రిల్ 15 రోజుల వేతనం ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు కంపెనీ మేనేజ్‌మెంట్‌ను అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా వారికీ ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని ఆయన కార్యాలయం నందు కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ మేనేజ్ మెంట్ తో పలుమార్లు చర్చించి కార్మికుడు నరేష్ కు రావాల్సిన మార్చి ఒక నెల, 15 రోజుల నెల వేతనం యాజమాన్యం నుంచి తీసుకొని వారి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కార్మికుడు నరేష్ మాట్లాడుతూ ఈ రోజుల్లో కూడా కార్మికులకు న్యాయం చేయడంలో ముందుండి ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతి కార్మికునికి న్యాయం చేస్తున్న రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకురాలు సబితమ్మ

విశాలాంధ్ర - ఆమనగల్లు: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఇనుప గనుల అక్రమ తవ్వకాల కేసులో 14 సంవత్సరాల తరవాత సీబీఐ కోర్టు తీర్పునిచ్చింది. తీర్పులో భాగంగా మాజీ మంత్రి వర్యులు, మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా తీర్పునివ్వడంపట్ల రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో సబితమ్మ అభిమానులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. 2011లో సబితా ఇంద్రారెడ్డిపై అప్పటి ప్రభుత్వం ఓబుళాపురం మైనింగ్ కేసులో పాత్ర ఉన్నట్లు అభియోగం మోపిందన్నారు. సబితా ఇంద్రారెడ్డి ప్రజల మనిషని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించే నేత అని అన్నారు. సబితా ఇంద్రారెడ్డి మచ్చలేని నాయకురాలని, చట్టాలపై, కోర్టులపై పూర్తి విశ్వాసం, గౌరవం ఉన్న నేత అని అన్నారు. ఈకేసులో సబితాఇంద్రారెడ్డి పాత్ర లేదని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేనందున వారిని నిర్దోషిగా ప్రకటించడం పట్ల సబితమ్మ అభిమానులు సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ,గోవర్ధన్,మహేష్,శేఖర్,యాదయ్య,కృష్ణయ్య, నర్సింహ్మా,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రెమెడియం లైఫ్ కేర్ రైట్స్ ఇష్యూ వృద్ధి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి : రెమెడియం లైఫ్ కేర్ లిమిటెడ్ రైట్స్ ఇష్యూ కంపెనీ వృద్ధి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. రెమెడియం లైఫ్ కేర్ అనేది వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్థ, ఇది ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు సరఫరా గొలుసు నిర్వహణలో భాగంగా ముడి పదార్థాల ట్రేడింగ్, పంపిణీలో ప్రత్యేకత కలిగి ఉంది. ఈ ఇష్యూకు ఇన్వెస్టర్లు, షేర్ హోల్డర్ల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రెండో రోజు ముగిసేనాటికి 26.03 శాతం సబ్ స్క్రిప్షన్ లభించిందని తెలిపింది. రెమెడియం లైఫ్ కేర్ లిమిటెడ్ హోల్ టైమ్ డైరెక్టర్ ఆదర్శ్? ముంజాల్ మాట్లాడుతూ, ఈ చర్య మా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా గణనీయమైన వృద్ధికి వేదికను ఏర్పరుస్తుంది. మా ప్రపంచ పాదముద్రను విస్తరించడం మరియు విస్తృత మార్కెట్కు సేవలందించడానికి పరిశోధన మరియు తయారీలో పురోగతి సాధించడంపై మా దృష్టి ఉంది. ఈ విధానం మా దీర్ఘకాలిక సుస్థిరత మరియు విజయాన్ని నిర్ధారిస్తుంది. ఫిబ్రవరి 2025 లో యుకెకు చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్ నుండి రూ .182.7 కోట్ల బహుళ సంవత్సరాల ఎగుమతి ఆర్డర్ను పొందడంలో కంపెనీ ఇటీవల సాధించిన తరువాత ఈ వ్యూహాత్మక మార్పు జరిగింది.

సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ నూతన బ్రాండ్ ఆవిష్కరణ

హైదరాబాద్: సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ తమ తాజా బ్రాండ్ ప్రచారణ 'ఫాంటసీ జరూరీ హై'ని ప్రారంభించింది. దీనిలో అత్యంత కీలకంగా ఒక ఉత్తేజకరమైన హిందీ కవిత ఉందని, దీనిని సినిమా రూపంలో అనువదించారని ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్‌లోని బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ చెప్పారు. జాతీయ అవార్డు గెలుచుకున్న గేయ రచయిత నేపథ్య గాయకుడు స్వానంద్కిర్కిరే రాయగా, బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ పఠించిన ఈ కవిత శ్రోతలను రోజువారీ జీవితంలోని దినచర్య నుండి ఫాంటసీ యొక్క అపరిమిత అవకాశాలకు విచిత్రమైన , ప్రతిబింబించే ప్రయాణంలో తీసుకెళు తుందన్నారు. బ్రాండ్ యొక్క ప్రతిపాదన "హార్ దిల్ కీ ఫాంటసీ"కి అనుగుణంగా, సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ, ప్రజలు ఊహించే, తప్పించుకునే మరియు వ్యక్తీకరించే అనంతమైన మార్గాలను పెద్ద మరియు చిన్న క్షణాలతో వేడుక జరుపుకుంటూనే ఉంది. ట్రాఫిక్ జామ్‌ల నుండి గ్రహాంతర యుద్ధాల వరకు, ఆఫీసు దినచర్యల నుండి అద్భుత కథల పరివర్తనల వరకు, ఈ చిత్రం ఊహ యొక్క లెక్కలేనన్ని అవతారాలను ఒడిసి పడుతుందన్నారు.

రాగి వైర్ల ఫ్యాన్లు ఉత్తమం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : వేసవి వేడి పెరుగుతున్న నేపథ్యంలో, మన ఇళ్లలో, దుకాణాల్లో, పాఠశాలల్లో కార్యాలయాల్లో ఫ్యాన్లు మళ్లీ అవసరమవుతున్నాయి. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో దశాబ్దాల క్రితం అమర్చిన ఫ్యాన్లు ఇప్పటికీ సమర్థవంతంగా పని చేస్తున్నాయి. అయితే, కొత్తగా ఇళ్లలో లేదా కార్యాలయాల్లో అమర్చిన ఫ్యాన్లు మాత్రం త్వరగా మందగించటం, శబ్దం చేయటం లేదా తరచూ మరమ్మతులు అవసరమవటం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దీని వెనక ముఖ్యమైన కారణం ఫ్యాన్ మోటార్‌లో ఉపయోగించే వైండింగ్ పదార్థమే. పాతరోజుల్లో ఫ్యాన్లలో రాగి వయరింగ్ వాడేవారు. అందుకని ఆ ఫ్యాన్లు ఈరోజుకి కూడా అదే పనితీరు, నమ్మకత్వం, మరియు విద్యుత్ సమర్థతలో కీలక పాత్ర పోషిస్తోన్నాయి. రాగికి అల్యూమినియంతో పోల్చితే సుమారు 39% ఎక్కువ ఎలక్ట్రికల్ కండక్టివిటీ ఉంటుంది, ఇది విద్యుత్ బదిలీని మరింత సమర్థవంతంగా చేస్తుంది. రాగి వయరింగ్ ఉపయోగించి ఉత్పత్తి చేసిన ఫ్యాన్ల పనితీరు మరియు జీవితకాల ఖర్చుల గురించి, ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్, డిజియం-ఉజాల, ఆశిష్ మాల్వియా మాట్లాడుతూ, "రాగి యొక్క అత్యుత్తమ విద్యుత్, థర్మల్ కండక్టివిటీ సీలింగ్ ఫ్లీర్ఘకాల, నమ్మకంగా పనిచేసేలా చేస్తుంది, దీర్ఘకాలికంగా నిలిచే మన్నికను కలిగిస్తుంది. దీని వల్ల జీవితకాల వ్యయం తక్కువగా ఉండి వినియోగదారులకు ఎక్కువ విలువ లభిస్తుంది" అని చెప్పారు. ఈ లాభాల వలన రాగి వయరింగ్ కలిగిన ఫ్యాన్లు సాధారణంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ధృవీకరించిన 3-స్టార్ లేదా అంతకంటే ఎక్కువ రేటింగ్ ఉన్న మోడల్స్‌లో లభిస్తాయి. దీనికి భిన్నంగా, అల్యూమినియం వాయిరింగ్ ఉన్న ఫ్యాన్లు సాధారణంగా నాన్-స్టార్ లేదా 1-స్టార్ మోడల్స్‌లో లభిస్తాయి.

ఎస్సై ప్రవీణ్‌కు ఎస్పీ సత్కారం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీస్ అధికారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్సై ప్రవీణ్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం తన కార్యాలయంలో సత్కరించి అభినందించారు. హైదరాబాదులో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సోమవారం జరిగిన జీ-తెలుగు అవార్డ్స్, తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్-2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎస్సై ప్రవీణ్ అవార్డును అందుకున్నారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకొని నిందితులను పట్టుకోవడం తోపాటు బాధ్యతగా విధులు నిర్వర్తించినందుకు గాను ఎస్సై కు రియల్ హీరోస్-2025 అవార్డును అందజేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖలో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ,ప్రజలకు సేవలందించే అధికారులు, సిబ్బందికి ఎప్పటికైనా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడి యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఎస్పి విచారం వ్యక్తం చేశారు. కొత్తగూడెం జిల్లాలో గంజాయి, అక్రమ రవాణాను అరికట్టడంలో తన వంతు కృషి చేసిన ఎస్ఐ ప్రవీణ్ ను మిగతా అధికారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం బేసిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం బేసిక్స్ పై ముంబయికి చెందిన ఐఐటి నిపుణులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు మంగళవారం ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఐఐటి ముంబయి నుండి వచ్చిన జిఐఎస్ సబ్జెక్ట్ నిపుణులు జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం వల్ల భవిష్యత్తులో కలిగే వివిధ ప్రయోజనాలను వివరించారు. జిఐఎస్ ను ఉపయోగించి వివిధ రకాల మ్యాప్స్ ను ఎలా తయారు చేయవచ్చు శిక్షణలో వివరించారు. వీటి ద్వారా ఆరోగ్యం , వ్యవసాయ రంగాలలో జిఐఎస్ ఏ విధంగా ఉపయోగపడుతుందో విద్యార్థులకు అర్థమయ్యేలా నిపుణులు శిక్షణ లో బోధించారు. ఈ శిక్షణలో జిల్లాలోని ఇంజనీరింగ్, మెడికల్, వ్యవసాయ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఐఐటి ముంబై ద్వారా ఇంటర్ షిప్ చేసే విధంగా ప్రోత్సహించటం జరుగుతుందని జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సంజీవరావు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు బుధవారం కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

20 శాతం వృద్ధే లక్ష్యం

పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు రాష్ట్ర పర్యాటక రంగంలో 20 శాతం వృద్ధి సాధించేందుకు అహర్నిశలు శ్రమిస్తామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం అధ్యక్షతన సచివాలయంలో జరిగిన పర్యాటక రంగ సమీక్షా సమావేశంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందేలా, అందరినీ ఆకర్షించేలా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలన్న సలహాలు, సూచనల మేరకు వార్షిక, త్రైమాసిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ప్రత్యేకించి టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్, నైట్ సఫారీ, డాల్ఫిన్ షోలు, 150 అరకు కాఫీ స్టాల్స్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు వంటి అనేక ప్రణాళికలు రూపొందించేందుకు చర్యలు ప్రారంభించామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రదేశాల్లోనూ ఆయా ప్రాంతాల ప్రాముఖ్యతను అనుసరించి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతి నెలా పర్యాటక ప్రగతి నివేదికను ముఖ్యమంత్రికి అందిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యాటక కేంద్రాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయమై ఆయా జిల్లాల కలెక్టర్ల అధ్వర్యంలో సమావేశం నిర్వహించి డీపీఆర్‌లు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. కేంద్ర పథకాల ద్వారా వచ్చే నిధులతో పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్లి పర్యాటక ప్రగతి సాధిస్తామని మంత్రి దుర్గేశ్ అన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి త్వరితగతిన అనుమతులు, రాయితీలు అందించి ప్రాజెక్టులు త్వరగా పట్టాలెక్కేలా చర్యలు ప్రారంభించామని తెలిపారు. భవానీ ఐల్యాండ్, హోప్ ఐల్యాండ్ సహా రాష్ట్రంలోని ఐల్యాండ్‌లన్నింటినీ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

యుద్ధమొస్తే ఎవరూ మిగలరు

దాడికి సాహసిస్తే చారిత్రక బదులిస్తాం: భారత్‌కు పాక్ హెచ్చరిక

ఇస్లామాబాద్: తమ దేశంపై దాడికి భారత్ సాహిస్తే చరిత్ర గుర్తుపెట్టేకునేలా బదులిస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ హెచ్చరించారు. యుద్ధం వస్తేగనుక ఎవరూ మిగలరని అన్నారు. భారత్ ఏ క్షణంలోనైనా తమ దేశంపై దాడి చేయొచ్చని... నియంత్రణ రేఖ వెంబడి సైనిక చర్యలకు భారత్ సంసిద్ధంగా ఉందని అన్నారు. ఖ్వాజా ఆసిఫ్ ఇస్లామాబాద్‌లో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.పాకిస్థాన్ భద్రతకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను ఉపేక్షించమన్నారు. ఎల్‌ఓసీ వెంబడి భారత్ ఏ క్షణంలోనైనా దాడులు చేయవచ్చని, అదే జరిగితే దీటైన బదులిస్తామని చెప్పారు. పాక్ ప్రతిస్పందన చరిత్రలో నిలిచిపోతుందని నొక్కిచెప్పారు. పాకిస్థాన్‌పై దాడికి భారత్ సాహసిస్తే ఎవరూ మిగలరని ఖ్వాజా ఆసిఫ్ హెచ్చరించారు. భారత్ తరపున ఎలాంటి చర్యలకైనా పాకిస్థాన్ సంసిద్ధంగా ఉందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం అణు యుద్ధం వచ్చే పరిస్థితులను భారత ప్రధాని మోదీ సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆయనను ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో పోల్చారు. నెతన్యాహు అడుగు జాడల్లో మోదీ నడవాలనుకొని పాకిస్థాన్ మీదకొస్తే చరిత్ర గుర్తుపెట్టేలా బదులివ్వడానికి పాకిస్థాన్ సిద్ధమని హెచ్చరించారు. ఒకవేళ యుద్ధమే జరిగితే పాకిస్థాన్‌లో ఎవరూ మిగలరని ఆయనన్నారు. నిషేధిత టీటీపీ, బీఎల్ఏ భారత్‌కు ప్రోక్సీలని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడిపై అంతర్జాతీయ విచారణను ప్రధాని షెహబాజ్ షరీఫ్ కోరినట్లు తెలిపారు. తద్వారా ఘటన వెనుక భారత్ లేక ఇతర అంతర్గత సంస్థ పాత్ర ఉందో లేదో తేలిపోతుందన్నారు. నిరాధార ఆరోపణలతో దాడికి భారత్ కాలుదువ్వుతోందని ఆసిఫ్ వ్యాఖ్యానించారు. ఖైబర్ పంక్తుఖ్వా, బలూచిస్థాన్‌లో ఉగ్రవాదంతో భారత్‌కు సంబంధాలు ఉన్నాయని, ఉగ్రవాదానికి నిధులు సమకూరుస్తోందని, సంబంధిత ఆధారాలను 2016, 2017లోనే ఐరాసకు ఇచ్చామన్నారు. సరిహద్దుకు రెండు వైపులా తమకు శత్రువులు ఉన్నట్లు తెలిపారు. మోదీ, నెతన్యాహు అహంతో భయానక రాజకీయాలు చేస్తారని విమర్శించారు. ఏ యుద్ధమైనా నియంత్రణ రేఖకే పరిమితమని చెబుతూ యుద్ధం మొదలైతే ఆపడం కష్టమన్నారు. సింధూ జల సంధి రద్దును ప్రస్తావిస్తూ నీటి నిలుపుదల కట్టడాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. 'నీరు మా రెడ్ లైన్... భవిష్యత్‌లో నీటి కోసం యుద్ధాలు జరుగుతాయి' అని ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. కాగా, దేశ ప్రతిష్ఠ, సుసంపన్నత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ సయ్యద్ ఆసిమ్ మునీర్ తేల్చిచెప్పారు.

10–11 తేదీల్లో భారత్ దాడి: అబ్దుల్ బాసిత్

రష్యా విక్టరీ డే తర్వాత పాకిస్థాన్‌పై భారత్ దాడులు చేయొచ్చని భారత్‌కు పాకిస్థాన్ మాజీ హై కమిషనర్ అబ్దుల్ బాసిత్ హెచ్చరించారు. ఆయన మంగళవారం ఎక్స్ మాధ్యమంగా భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలపై స్పందించారు. ఈనెల 10, 11 తేదీల్లో పాకిస్థాన్‌పై భారత్ దాడికి అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. రష్యా విక్టరీ డేకు భారత్ ప్రధాని మోదీ వెళ్లాల్సి ఉండగా ఆయన స్థానంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవ్వాలని అనుకున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్‌నాథ్ సింగ్ కూడా వెళ్లరని తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదంపై చర్యలకు మద్దతు తెలిపారు. ఈ పరిస్థితుల్లో రష్యా పరేడ్ ముగిసిన ఒకటి, రెండు రోజుల్లో పాకిస్థాన్‌పై సైనిక చర్యలకు భారత్ పూనుకుంటుందన్న అబ్దుల్ బాసిత్ పోస్టు వైరలైంది.

శ్రీసిటీలో ఎల్జీ యూనిట్

- రూ.5,001 కోట్ల పెట్టుబడులు... 2 వేల మందికి ఉద్యోగాలు
- రూ.839 కోట్లతో మరో 5 అనుబంధ యూనిట్లు
- రేపు మంత్రి నారా లోకేశ్ భూమి పూజ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అంతర్జాతీయ స్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్జీ ఎలక్ట్రానిక్స్ తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో వచ్చే ఆరేళ్లలో వివిధ దశల్లో రూ.5,001 కోట్ల వ్యయంతో తమ యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. దీనికి రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం భూమి పూజ చేయనున్నారు. 2024 సెప్టెంబరులో జపాన్ నుంచి వచ్చిన ఎల్జీ కంపెనీ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ పాలసీలు, రాయలసీమను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి చేస్తున్న కృషి, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం తీసుకుంటున్న చర్యల గురించి కంపెనీ ప్రతినిధులకు వివరించారు. మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రంలో తమ యూనిట్ నెలకొల్పేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, ఏసీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు వంటివి కొత్తగా ఏర్పాటు చేసే యూనిట్‌లో తయారవుతాయి. అలాగే ఎల్జీ తమ ఉత్పత్తులకు అవసరమైన విడి భాగాలను వేరే దేశాల నుంచి తీసుకురావడం కాకుండా కంప్రెసర్, మోటార్ కంప్రెసర్, హీట్ ఎక్స్‌ఛేంజర్ భాగాలను ఏపీలోనే తయారుచేయనుంది. శ్రీసిటీలో ఏర్పాటు చేసే యూనిట్, అనుబంధ కంపెనీల ద్వారా రాబోయే ఆరేళ్లలో యువతకు 2 వేల ఉద్యోగాలు లభిస్తాయి. రూ.839 కోట్లతో మరో 5 అనుబంధ యూనిట్లు ఆరేళ్లలో ఏర్పాటు కాబోతున్నాయి.

రిజర్వేషన్ రైలుబోగీ లాంటిది: సుప్రీం

న్యూఢిల్లీ: రిజర్వేషన్లను ఉద్దేశించి సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లాంటివని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరని తెలిపింది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ విచారణలో భాగంగా సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈవిధంగా స్పందించారు. మహారాష్ట్రలో 2016–17లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఓబీసీ కోటా విషయంలో జరుగుతోన్న న్యాయపోరాటంలో ఎన్నికల నిర్వహణలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఓబీసీలకు 27 శాతం కోటా అమలు చేయడం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను 2021లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓబీసీలకు సంబంధించిన డేటా ఉన్నప్పటికీ... దానిని ప్రభుత్వం ఉపయోగించడం లేదని తాజాగా పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అధికారుల ద్వారా స్థానిక సంస్థలను ఏకపక్షంగా నడుపుతోందని ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రయోజనం పొందేందుకు ఓబీసీలలోనే వెనకబడిన వారిని గుర్తించాలని మరో న్యాయవాది తన వాదనను వినిపించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'దేశంలో రిజర్వేషన్లు రైలు బోగీలు మాదిరిగా మారాయి. అందులోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరు. అయితే ప్రభుత్వాలు మరిన్ని వెనకబడిన తరగతులను గుర్తించాలి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వ్యక్తులు ఉన్నారు. వారు రిజర్వేషన్ ప్రయోజనం ఎందుకు పొందకూడదు? కొన్ని కుటుంబాలు, సమూహాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయి' అని ఆయన అన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు పార్టీనే

మానం ఆంజనేయులు

విశాలాంధ్ర–యలమంచిలి (అనకాపల్లి జిల్లా): ప్రపంచంలో పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక టీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన అనకాపల్లి జిల్లా సీపీఐ రెండవ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కమ్యూనిస్టు పార్టీ ఓట్ల కోసం సీట్ల కోసం ఆలోచించదని... ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీని ఎండగట్టడానికి, పేదలకు సంక్షేమ పథకాలు దక్కేందుకు పోరాడుతుందన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నేడు కేంద్రంలోని మోదీ సర్కారు నిరంకుశ, రైతు, కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. అంబానీ, అదాని వంటి కార్పొరేట్లకు ప్రజాధనం దోచిపెడుతున్నారని మండిపడ్డారు. పేదలకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా అధ్యక్షులు బీ వెంకటరమణ, కార్యదర్శి బీవీ రమణ, సహాయ కార్యదర్శి ఎం.రామ నాయుడు, ఆర్.దొరబాబు, కార్యవర్గ సభ్యులు కే సన్యాసిరావు, ఆర్.జగ్గారావు, సీహెచ్ క్రాంతి, బీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

47 ఏళ్లకు డీఎస్సీ వయోపరిమితి

- ఫిజికల్ సైన్స్ పోస్టుల్లో బీఎస్సీ అభ్యర్థులకు అర్హత
- పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలి
- చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: డీఎస్సీ 2025లో 'ఫిజికల్ సైన్స్' టీచర్ పోస్టుల నియామకాల్లో బీఎస్సీ అభ్యర్థులకు అర్హత కల్పించేలా సవరణ చేయాలని, డీఎస్సీ నియామకాల్లో అభ్యర్థుల వయోపరిమితిని 47ఏళ్లకు పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. డీఎస్సీలో ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టుకు అర్హత విషయంలో పాఠశాల విద్యాశాఖ ద్వంద్వ విధానం అవలంబించడం శోచనీయమని, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్‌లో ఎంపీసీ చదివి, బీఈడీలో సంబంధిత మెథడాలజీ చదివి ఉండాలనేది అర్హతగా నిర్ణయించి... బీఎస్సీ కంప్యూటర్స్ చదివిన వారికి అర్హత కల్పించలేదని తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ) చదివిన వారికి మాత్రం ఆ పోస్టుకు అర్హత కల్పించారని, బీసీఏలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులు రెండూ ఉండనప్పటికీ బీఎస్సీ కంప్యూటర్స్‌లో ఫిజిక్స్ ఉంటుందని వివరించారు. కెమిస్ట్రీ లేదు కాబట్టి బీఎస్సీ కంప్యూటర్స్ అభ్యర్థులు అనర్హులైతే... బీసీఏ అభ్యర్థులు ఎలా అర్హులయ్యారో అర్థంకాని పరిస్థితి అభ్యర్థుల్లో నెలకొందన్నారు. బీసీఏ చదివిన వారు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదవాలనే నిబంధన పెట్టారని, బీఎస్సీ చదివినవారూ ఇంటర్‌లో ఎంపీసీ చదువుతారని పేర్కొన్నారు. బీసీఏ అభ్యర్థులకు గణితం, ఫిజిక్స్, బయాలజీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత కల్పించారని... బీఎస్సీ చదివిన వారికి సైతం డీఎస్సీలో ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టుకు అర్హత కల్పించాలన్నారు. ఆరు సంవత్సరాల తర్వాత పాఠశాల విద్యాశాఖ మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 30వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుండగా, కేవలం 16,347 టీచర్ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి...3 నెలల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేసేలా షెడ్యూలు రూపొందించిందని పేర్కొన్నారు. 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 7,729 పోస్టులు భర్తీ చేశారని... గత వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. జీవో నంబరు 117 తీసుకొచ్చి కొన్ని జిల్లాలలో స్కూళ్లను విలీనం చేయడంవల్ల ఆయా జిల్లాల్లో ఉపాధ్యాయ పోస్టులే లేకుండా పోగా...దీనికితోడు ఇప్పుడు ఆరేళ్ల తర్వాత నోటిఫికేషన్ రావడంతో చాలా మంది నిరుద్యోగుల వయోపరిమితి దాటిపోతోందని తెలిపారు. ఫలితంగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనుకున్న అభ్యర్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారి, నిరుద్యోగులలో ఆందోళన ఎక్కువైందని వివరించారు. ప్రస్తుతం 42 సంవత్సరాల వయోపరిమితిని 44 సంవత్సరాలుగా మార్చినట్లు చెబుతున్నప్పటికీ, 2018లో డీఎస్సీ అభ్యర్థులకు కూడా 44 సంవత్సరాల వరకు వయోపరిమితి సడలింపు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం వయోపరిమితి సడలింపుపై ప్రభుత్వం పునరాలోచించి 47ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలని, డీఎస్సీ అభ్యర్థులకు పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉండాలనే నిబంధన కారణంగా వేలాది మంది అభ్యర్థులు నష్టపోతున్నందున ఆ నిబంధనను సడలించాలన్నారు. డీఎస్సీ పరీక్షలు జరుగనున్న (జూన్ 6 నుంచి జులై 6 వరకు) తేదీల్లోనే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతున్నందున, ఏపీపీఎస్సీ పరీక్షల తేదీలను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

13 ఉమ్మడి జిల్లాల్లో అబ్దుల్ కలాం విగ్రహాలు

విగ్రహ ఆకృతులను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: వైబ్రంట్స్ ఆఫ్ కలాం అనే సంస్థ ఆంధ్ర ప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల్లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాలు ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంకు చెందిన ఈ సంస్థ వ్యవస్థాపకులు విజయ్ కలాం నేతృత్వంలో ఈ విగ్రహాలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఈ విగ్రహాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు చూపించేందుకు సచివాలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహ ఆకృతిని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. విజయ్ కలాం మాట్లాడుతూ పదేళ్లుగా దేశ వ్యాప్తంగా అబ్దుల్ కలాం స్ఫూర్తితో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల 'గ్రేట్ ఇండియన్ స్టాట్యూస్' పేరుతో 20 అడుగుల ఎత్తుతో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కలాంను సీఎం చంద్రబాబు అభినందించారు. అబ్దుల్ కలాంతో తనకున్న అనుబంధాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, సంస్థ సభ్యులు శివ, భాస్కర్, శ్రీను, రంజిత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పోలవరంతోనే రాష్ట్రాభివృద్ధి

పెండింగ్ డిజైన్లకు వెంటనే అనుమతులు
నిపుణులను కోరిన మంత్రి నిమ్మల

విశాలాంధ్ర–పోలవరం: రాష్ట్ర అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు పూర్తికి అవినాభావ సంబంధం ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విదేశీ నిపుణుల బృందానికి తెలిపారు. జాతీయ స్థాయిలో నదుల అనుసంధానం... పోలవరం ప్రాజెక్టు పూర్తిగా విడదీయలేని పరస్పర ఆధార ప్రాజెక్టులుగా మంత్రి అభివర్ణించారు. అందువల్లనే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంపై ప్రత్యేక దృష్టి నిలిపారని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సాంకేతిక సలహాలు ఇవ్వడానికి వచ్చిన విదేశీ నిపుణుల బృందాన్ని మంత్రి నిమ్మల మంగళవారం కలిశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయవలసిన ఆవశ్యకతను, అవసరాన్ని నిపుణుల బృందానికి వివరించారు. ముందు నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2027కి ప్రాజెక్టు పూర్తి చేయవలసి ఉందని, అందువల్ల మీరంతా సహకరించి లక్ష్యాన్ని కంటే ముందుగా పూర్తయ్యేటట్లు ప్రయత్నించాలని కోరారు. ఎగువ కాఫర్ డ్యామ్ బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్, గ్యాప్–2 డి వాల్ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. నిపుణుల కమిటీతో మాట్లాడి సాంకేతిక వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న అంశాన్ని మంత్రి వారి దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో మూడుసార్లు ప్రాజెక్టును సీఎం సందర్శించారని తెలిపారు. పనుల షెడ్యూల్‌ని నిర్ణయించి ప్రతి 15 రోజులకు ఓసారి సచివాలయంలో సమీక్షిస్తున్నారని, అందువల్లనే పోలవరం ప్రాజెక్టు పనులు పరుగులు పెడుతున్నాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే... గోదావరి జలాలు కరువు ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమకు తరలించడం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే గ్యాప్–2లో డి వాల్ నిర్మాణం పనులు, ఎగువ కాఫర్ డ్యామ్ బలోపేతం చేయడానికి వీలుగా నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గ్యాప్–1, గ్యాప్–2 తో పాటు మిగిలిన పనులకు సంబంధించిన డిజైన్లకు త్వరితగతిన అనుమతులు ఇస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్టు పనులు పూర్తి చేయగలుగుతామని నిపుణులకు మంత్రి వివరించారు. నిపుణుల ప్యానెల్ కమిటీ, సీడబ్ల్యూసీ, పీపీఏ, ఆఫ్రి, ఏజెన్సీల సమన్వయంతో పని చేస్తూ లక్ష్యానికి ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని మంత్రి రామానాయుడు సూచించారు.

విశాఖ ఉక్కు అదానీకి కట్టబెట్టేందుకే...

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
లేదంటే ఆమరణ నిరాహార దీక్ష : వైఎస్ షర్మిల

విశాలాంధ్ర–గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానీకి కేంద్రం అమ్మాలని చూస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆరోపించారు. మంగళవారం స్టీల్ కార్మికులకు మద్దతుగా కూర్మన్నపాలెం దీక్షా శిబిరంలో దీక్ష చేసిన ఆమె మాట్లాడుతూ పాలకులు ద్వంద్వ వైఖరితో ముందుకు పోతున్నారని, ఒకరు ప్రైవేట్ అవ్వదంటారు, మరొకరు అమ్మేది లేదంటారు... ఇందులో ఏది నిజం అంటూ షర్మిల దుయ్యబట్టారు. ప్యాకేజీ పేరుతో కార్మికులను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రూ.1,150 ప్యాకేజీ ఇచ్చినట్లు ప్రకటించి... రూ.8,500 కోట్ల బ్యాంకు అప్పులు తీర్చడంలో ఆంతర్యమేంటి ఈ సందర్భంగా నిలదీశారు. ఆరు నెలలుగా కాంట్రాక్టు కార్మికులను తొలగించిన విషయాన్ని గుర్తు చేస్తూ సీఎస్ఆర్ పేరుతో 12 వందల మందిని ఇంటికి పంపించిందన్నారు. ఈ విషయంలో ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు మాట తప్పారో చెప్పాలని నిలదీశారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అనుమతులు ఇచ్చిన చంద్రబాబు, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను కట్టింది కాంగ్రెస్ పార్టీ అని, దానిని కాపాడేది కూడా తమ పార్టీయేనని స్పష్టం చేశారు. ఈ నెల 20 లోపు తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. లేదంటే 21వ తేదీ నుంచి శిబిరంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ, జె.అయోధ్య రాము, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేతన్నలకు 365 రోజుల పనే లక్ష్యం

ఎంఎస్ఎంఈ పార్కు భూమి పూజలో మంత్రులు సవిత, ఫరూఖ్, భరత్

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు/ఎమ్మిగనూరు: నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే లక్ష్యమని మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసిలో ఎంఎస్ఎంఈ పార్కుకు మంగళవారం భూమి పూజ జరిగింది. కార్యక్రమంలో మంత్రులు సవిత, ఫరూఖ్, టీజీ భరత్‌తో పాటు ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, పార్థసారథి, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, కలెక్టర్ పి.రంజిత్ బాషా పాల్గొన్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి చేనేతకు 365 రోజులు పని కల్పించాలనదే లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో చేనేతలకు హెల్త్ పాలసీ ఇస్తామని, పింఛన్ పెంచామని చెప్పారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. 25 ఎకరాల్లో హ్యాండ్లూమ్ పార్క్, మిగతా భూమిలో ఇండస్ట్రియల్ టెక్స్‌టైల్ పార్క్ తెచ్చి ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారు. కర్నూలుకు హై కోర్టు బెంచ్ తెస్తున్నామని చెప్పారు. జిల్లాను డ్రోన్ హబ్‌గా మారుస్తామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో మౌలిక సదుపాయాల కల్పన, మిగిలిన 50 ఎకరాలలో టెక్స్‌లైట్ యూనిట్ల ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వాడకు ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఇస్తామని హామీ ఇచ్చారు. రేఖా రాణి మాట్లాడుతూ పార్కులో 22 ఎకరాలు చిన్న ప్లాట్లుగా మగ్గాలు పెట్టుకోవడానికి, మిగిలిన భూమిని వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించినట్లు తెలిపారు. నేతన్నలకు ఐడీలు ఇవ్వడం ద్వారా వారికి ముద్ర రుణం వస్తుందని, ఉచితంగా విద్యుత్ లభిస్తుందన్నారు. కేటాయించిన ప్రదేశంలో షెడ్‌ల నిర్మాణం, క్యాంటీన్, డిజైన్స్ స్టూడియో పెట్టుకుంటే 365 రోజులు పని ఉంటుందని ఆమె చెప్పారు.

2027లో గగన్‌యాన్: ఇస్రో

బెంగళూరు: భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొలి మానవ సహిత వ్యోమనౌక 'గగన్‌యాన్' ప్రయోగం అనుకున్న సమయం కంటే బాగా ఆలస్యం కాబోతోంది. ఈ మిషన్ కోసం భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) చకాచకా పనులు పూర్తి చేస్తోంది. కానీ 2027 కంటే ముందు గగన్‌యాన్‌ను ప్రయోగించే అవకాశం లేకపోయింది. ఇదే విషయాన్ని ఇస్రో చైర్మన్ వి.నారాయణ్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 2027 తొలి త్రైమాసికంలో గగన్‌యాన్‌ను ప్రయోగిస్తామని ప్రకటించారు. ఈ క్లిష్ట ప్రాజెక్టు కోసం అత్యాధునిక సాంకేతికల పోటీ దృష్ట్యా ఈ ఏడాది చివరిలో ప్రయోగం సాధ్యం కాదని తెలిపారు. 'వాస్తవానికి ఈ ఏడాది చివరిలో గగన్‌యాన్, ఆ తర్వాత 2026లో మరో రెండు చిన్న మిషన్లు షెడ్యూల్ అయ్యాయి. గగన్‌యాన్ సంక్లిష్ట ప్రయోగం. ఇందులో భాగంగా భూమి కింది కక్ష్యలోకి వ్యోమగాములను పంపాల్సి ఉంది. అయితే అంతకంటే ముందు హ్యూమనాయిడ్ 'వ్యోమమిత్ర'ను పంపుతామ'ని నారాయణ్ వెల్లడించారు. 'ఇది చాలా సంక్లిష్టమైన ప్రాజెక్టు. మొట్టమొదటిసారి ఇలాంటిది జరుగుతోంది. ఇప్పటికే 90 శాతం పని పూర్తి అయింది. దాదాపు తుది దశకు చేరుకుంది. అంతా అనుకున్నట్లు జరిగితే గగన్‌యాన్ 2027 మొదటి త్రైమాసికంలో నింగిలోకి దూసుకెళ్లబోతోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే రష్యా, అమెరికా, చైనా తర్వాత అంతరిక్షంలోకి మానవులను పంపిన నాల్గో దేశంగా భారత్ నిలుస్తుంది' అని నారాయణ్ అన్నారు.

న్యూయార్క్ టైమ్స్‌కు 'పులిట్జర్' పంట

అఫ్గానిస్థాన్, సూడాన్ రిపోర్టింగ్‌కు నాలుగు పురస్కారాలు
న్యూయార్కర్‌కు మూడు – 'ప్రో పబ్లికా'కు రెండోసారి పబ్లిక్ సర్వీస్ మెడల్

న్యూయార్క్: పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక 'పులిట్జర్' పురస్కారాలు ప్రకటించారు. న్యూయార్క్ టైమ్స్‌కు నాలుగు, న్యూయార్కర్‌కు మూడు చొప్పున ఈ పురస్కారాలు లభించాయి. పులిట్జర్ ప్రతిష్ఠాత్మక పబ్లిక్ సర్వీస్ మెడల్ వరుసగా రెండోసారి 'ప్రో పబ్లికా'కు దక్కింది. గర్భ విచ్ఛిత్తి చట్టాలున్న అమెరికాలోని రాష్ట్రాల్లో అత్యవసర వైద్యం అందించడంలో వైద్యులు ఆలస్యం చేయడంతో మహిళలు మరణించడంపై రిపోర్టింగ్‌కు 'ప్రో పబ్లికా' జర్నలిస్టులు కవితా సురానా, లిజ్జీ ప్రెస్సెర్, కసాంద్రా జరమిల్లో, స్టేసీ క్రానిట్జ్‌ను 'పులిట్జర్' వరించింది. అమెరికా ఎన్నికల ప్రచారమప్పుడు హత్యాయత్నం నుంచి తప్పించుకున్న డొనాల్డ్ ట్రంప్‌పై కవరేజీకి 'వాషింగ్టన్ పోస్ట్'కు పురస్కారం లభించింది. అమెరికా సీక్రెట్ ఏజెంట్లు చుట్టూ నిలబడి ఉండగా, చెవి నుంచి రక్తం కారుతూ మధ్య అభివాదం చేస్తున్న ట్రంప్ ఫొటోలందించిన ఫొటో జర్నలిస్ట్ డగ్ మిల్స్‌ను బ్రేకింగ్ న్యూస్ విభాగంలో పులిట్జర్ వరించింది. పెర్సీవల్ ఎవరెట్ రాసిన 'జేమ్స్' పుస్తకానికి పులిట్జర్ సాహిత్య పురస్కారం లభించింది. మొత్తం 15 విభాగాల్లో విజేతలకు పులిట్జర్ ప్రైజ్‌తో సన్మానించారు. పబ్లిక్ సర్వీస్ విజేతకు స్వర్ణ పతకం... మిగతా విజేతలకు 15 వేల డాలర్ల నగదు పురస్కారం అందజేశారు. అఫ్గానిస్థాన్, సూడాన్, బల్టిమోరె, బట్లర్, పెన్సిల్వేనియా రిపోర్టింగ్‌కుగాను న్యూయార్క్ టైమ్స్‌కు అవార్డులు వచ్చాయి. అఫ్గనిస్థాన్‌లో యూఎస్ విధానం పరిశీలనపై ఎక్స్‌ప్లనేటరీ రిపోర్టింగ్ ప్రైజ్‌ను ది టైమ్స్‌కు చెందిన ఆజమ్ అహ్మద్, క్రిస్టినా, గోల్‌బామ్, కాంట్రిబ్యూటింగ్ రైటర్ మాథ్యూ ఐకిన్స్ అందుకున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.